


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 210 పేజిలు : 12, వెల రూ. 5/- మంగళవారం, సెప్టెంబరు 22, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం: సీఎం చంద్రబాబు

కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి

సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక

వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం,

(మిగతా 2వ పేజీలో)



## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

### శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ

ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన

హైదరాబాద్: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం

(మిగతా 2వ పేజీలో)



## మద్దూరులో 50 ఎకరాల ఫాంహౌస్.. 12 ఎకరాలు ఇనాం భూములా?

జగదీశ్‌రెడ్డి ఫాంహౌస్‌పై కాంగ్రెస్ నేతల 'నిజ నిర్ధారణ'

సర్వే నంబర్లు 162, 223లో భూములున్నాయని ఆరోపణ

ఇందులో సుమారు 12 ఎకరాలు ఇనాం భూములని వ్యాఖ్య

ఇతర ప్రాంతాల్లోనూ వందల ఎకరాలు ఆక్రమించారంటూ ఆరోపణలు

ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల పెరుగుదలపై చామల ప్రశ్నలు

భూములు, జలవనరులపై విచారణ జరిపించాలని డిమాండ్

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరులో సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డికి చెందినదిగా పేర్కొంటున్న ఫాంహౌస్ చుట్టూ భూముల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మద్దూరులో సుమారు 50 ఎకరాల్లో ఫాంహౌస్ ఉందని, అందులో దాదాపు 12 ఎకరాలు ఇనాం భూములని కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ఆరోపించింది. గత ప్రభుత్వ హయాంలో

(మిగతా 2వ పేజీలో)



## బేగంపేటలో భారీ చోరీ..

81 తులాల బంగారం, నగదు అపహరణ

81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు అపహరణ

ఇంట్లో పనిచేసే సిబ్బందిపైనే అనుమానం

ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

### ::: రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం

బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ

సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ

అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్: ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు

(మిగతా 2వ పేజీలో)

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన కేసు

అరెస్టు చేయవద్దంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన పోలీసులు

కౌంటర్ దాఖలు చేయాలంటూ మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు








## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం

దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు



హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి

(మిగతా 2వ పేజీలో)




## యూపీఐ ఛార్జీలు వద్దు

### కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి

యూపీఐ చెల్లింపులపై ఛార్జీల నుంచి మినహాయింపు కోరిన రిటైలర్లు

అతి తక్కువ లాభాలతో వ్యాపారం చేస్తున్నామని ఆవేదన

0.4 శాతం ఎండీఆర్ విధిస్తే వ్యాపార మనుగడకే ప్రమాదమని హెచ్చరిక

## మద్దూరులో 50 ఎకరాల ఫాంహౌస్..

# 12 ఎకరాలు ఇనాం భూములా?

ప్రభుత్వ, ఎసైన్డ్, ఇనాం భూముల ఆక్రమణలు, జలవనరుల కబ్జాలపై ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు చేపట్టిన 'నిజ నిర్ధారణ' యాత్రలో భాగంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం మద్దూరులోని ఫాంహౌస్‌ను సందర్శించారు. మద్దూరులోని సర్వే నంబర్లు 162, 223లో మొత్తం 50 ఎకరాల భూమి ఉందని, అందులో సుమారు 12 ఎకరాలు ఇనాం భూములని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ భూములతోపాటు జలవనరుల ఆక్రమణకు సంబంధించిన అంశాలను కూడా వారు ప్రస్తావించారు. గత తొమ్మిదిన్నరేళ్లలో ప్రభుత్వ, ఎసైన్డ్, ఇనాం భూములపై జరిగినట్లు చెబుతున్న ఆక్రమణలను వెలుగులోకి తీసుకురావడమే తమ యాత్ర ఉద్దేశమని నేతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కుటుంబ సభ్యులు, భారాస నాయకులు భూములు, జలవనరుల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలను వారు పునరుద్ఘాటించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జగదీశ్‌రెడ్డి ఆస్తులు గత కొన్నేళ్లలో భారీగా పెరిగాయని ఆరోపించారు. 2009 ఎన్నికల సమయంలో ఆయన తన ఆస్తులను రూ.12 లక్షలుగా చూపించారని, 2014, 2018, 2023 ఎన్నికల నాటికి ఆస్తులు వందల కోట్లకు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఫాంహౌస్ ఎలా నిర్మించారని నిలదీశారు. ఇందులో సుమారు 12 ఎకరాలు ఇనాం భూములు ఉన్నాయని ఆరోపించారు. ఈ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని అర్హులైన వారికి అందించాలని కలెక్టర్‌ను కోరుతున్నామని తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి రాకముందు జగదీశ్‌రెడ్డి ఆస్తి మూడు ఎకరాల చలక, రెండు దున్నపోతులు మాత్రమేనని ఆరోపించారు. అనంతరం ఆయన స్వగ్రామం నాగారంలో 100 ఎకరాలు చెరబట్టారని ఆరోపించారు. జగదీశ్‌రెడ్డి భార్య సొంతూరు ఇప్పర్తిలోనూ 80 ఎకరాలు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ భూముల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మద్దూరులోని 50 ఎకరాల ఫాంహౌస్ ముంపునకు గురికాకుండా రోడ్లు వేయించారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. చేగూరు గ్రామ శివారులోని సర్వే నంబర్లు 433, 213లో గుట్టను తొలగించి, అక్కడి మట్టిని కాలువలో వేసి మూసేయించారని ఆరోపించారు. భూములు, జలవనరులకు సంబంధించిన ఈ



వ్యవహారాలపై అధికార యంత్రాంగం సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను తేల్చాలని కోరారు. 'నిజ నిర్ధారణ' యాత్రలో భాగంగా మద్దూరుకు వచ్చిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఫాంహౌస్ ఉన్న భూములు, వాటి సర్వే నంబర్లు, ఇనాం భూములుగా పేర్కొంటున్న విస్తీర్ణం, జలవనరులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వ భూములు, ఎసైన్డ్ భూములు, ఇనాం భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరిగిందా అన్నది నిర్ధారించాలని వారు కోరారు. తమ ఆరోపణలపై అధికారుల విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో భారీ చోరీ..



హైదరాబాద్‌లోని బేగంపేటలో భారీ చోరీ చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమానగర్‌లో నివసిస్తున్న శ్రీనాథ్ నాయుడు అనే వ్యక్తి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఇంట్లో భద్రపరిచిన 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే, శ్రీనాథ్ నాయుడు కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని అల్మారాలో దాచిన నగదు, నగలు మాయమైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వెంటనే పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనాథ్ నాయుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## యూపీఐ ఛార్జీలు వద్దు..

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది.దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు, నెలకు రూ. 10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు యూపీఐ లావాదేవీలు జరిపే రిటైలర్‌పై ప్రతి నెలా రూ.4,000 నుంచి రూ. 16,000 వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది.విక్రయాలు పడిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో మొబైల్ రిటైల్ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉందని అసోసియేషన్ తెలిపింది. దీనికి తోడు స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, 2025లో రూ. 10,000కు లభించిన ఎంట్రీ-లెవల్ స్మార్ట్‌ఫోన్ ధర ప్రస్తుతం రూ. 17,000కు చేరిందని, 2026 డిసెంబర్ నాటికి ఇది రూ. 20,000కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.

# కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి: జూపల్లి

**కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు చేశారన్న జూపల్లి**

**వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను**

**బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపాటు**

**జూరాల వద్ద రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్ల**

**5.50 లక్షల ఎకరాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన**



గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

**ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే**

**సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి**

**మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన**

**శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన**

**ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు**



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్



శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం: సీఎం చంద్రబాబు

స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు. కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. "2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగానూ కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

**అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన కేసు**

**అరెస్టు చేయవద్దంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన పోలీసులు**

**కౌంటర్ దాఖలు చేయాలంటూ మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా... విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.

## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com
మంగళవారం, సెప్టెంబరు 22, 2026

# ప్రతీకారమే పరిష్కారమా?

వైష్ణవి ఘటన నేర్పుతున్న గుణపాఠం.. హత్యకు హత్య సమాధానం కాదు.. ఆవేశానికి లోనై ప్రాణాలు తీయడం, దానికి సామాజిక మద్దతు కోరడం మరింత ప్రమాదకరం

ఒక విషాదం.. మరో విషాదానికి దారితీసింది. ఒక కుటుంబంలో చెలరేగిన కన్నీరు.. మరో కుటుంబంలోనూ విషాదాన్ని మిగిల్చింది.

జగిత్యాల జిల్లాకు చెందిన వైష్ణవి మృతిచెందిన ఘటనకు సంబంధించి ఆమె భర్త హరిబాబుపై కేసు నమోదై, ఆయన అరెస్టయ్యారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన హరిబాబు సెప్టెంబరు 17న నిజామాబాద్‌లో హత్యకు గురయ్యారు. ఈ హత్యకు తానే బాధ్యుడినని వైష్ణవి సోదరుడు సంతోష్ చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. పోలీసులు ఆయనను అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ రెండు ఘటనల వెనుక ఉన్న పూర్తి వాస్తవాలు దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో తేలాల్సి ఉంది.

అయితే ఈ ఘటనను కేవలం రెండు నేరాలుగా మాత్రమే చూస్తే అసలు ప్రశ్నకు సమాధానం దొరకదు. ఒక కుటుంబానికి జరిగిన విషాదం మరో కుటుంబాన్ని నాశనం చేయకుండా ఉండాలంటే ఏం చేయాలి? అన్నదే సమాజం ముందున్న అసలు ప్రశ్న.



**ఆవేదన నుంచి ప్రతీకారం వరకు..**

తనవారికి అన్యాయం జరిగిందన్న భావన కలిగినప్పుడు ఆవేదన, ఆగ్రహం కలగడం సహజం. కానీ ఆ ఆగ్రహం ప్రతీకారంగా మారినప్పుడు సమస్య పరిష్కారం కాదు.. మరో సమస్యకు ఆరంభమవుతుంది. నేరం జరిగితే దర్యాప్తు జరగాలి. ఆధారాలు సేకరించాలి. నిందితుడి పాత్రను న్యాయస్థానం నిర్ణయించాలి. తప్పు రుజువైతే చట్టప్రకారం శిక్ష పడాలి. వ్యక్తిగతంగా శిక్ష విధించడం న్యాయానికి ప్రత్యామ్నాయం కాదు.

**హత్యకు ప్రతీకారం హత్య అయితే.. న్యాయవ్యవస్థకు స్థానం ఎక్కడ?**

సోషల్ మీడియా.. సమాచారం నుంచి ఆవేశం వరకు

సెల్‌ఫోన్ నేడు జీవితంలో భాగమైంది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలు ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అదే సమయంలో వ్యక్తిగత సమస్యలు, కుటుంబ విభేదాలు, ఆరోపణలు, ఆవేదనలు కూడా క్షణాల్లో సామాజిక మాధ్యమాల్లోకి వస్తున్నాయి. ఒకసారి వ్యక్తిగత అంశం సోషల్ మీడియాలోకి వెళితే అది ఇక పూర్తిగా వ్యక్తిగతంగా ఉండదు. వేలమంది చూస్తారు. వందలమంది వ్యాఖ్యానిస్తారు. వాస్తవాలు పూర్తిగా తెలియకముందే ఒకరికి మద్దతుగా, మరొకరికి వ్యతిరేకంగా తీర్పులు వెలువడతాయి.

**వీడియో వైరల్ కావచ్చు.. కానీ నిజం మాత్రం దర్యాప్తుతోనే బయటపడాలి.**

సోషల్ మీడియా కోర్టు కాదు. వైరల్ వీడియో సాక్ష్యం కాదు. నెటిజన్ల కామెంట్ తీర్పు కాదు.

**మాట చిన్నదే.. ప్రభావం పెద్దది**

సోషల్ మీడియాలో స్పందించడం చాలా సులభం. 'న్యాయం జరగాలి', 'చట్టపరంగా పోరాడండి' అని చెప్పడం ఆవేదనలో ఉన్నవారికి ధైర్యాన్నిస్తుంది. కానీ 'వదలొద్దు', 'ప్రతీకారం తీర్చుకోండి', 'మేమంతా మీతోనే ఉన్నాం' వంటి వ్యాఖ్యలు ఇప్పటికే ఆవేశంలో ఉన్న వ్యక్తిని మరింత రెచ్చగొట్టే అవకాశం ఉంది. ప్రతి నేరానికి సోషల్ మీడియా వ్యాఖ్యలే కారణమని చెప్పలేం. కానీ మన మాటకు బాధ్యత మాత్రం ఉండాలి.

కామెంట్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి. మన మాట సమస్యను చల్లారుస్తుందా? లేక మంటను మరింత పెంచుతుందా?

రీల్స్ కోసం జీవితాన్ని బహిరంగం చేయొద్దు

సోషల్ మీడియా వినియోగమే తప్పు కాదు. సాంకేతికత ఒక సాధనం. దాన్ని ఎలా ఉపయోగించాలో మనమే నిర్ణయించుకోవాలి. రీల్స్ చేయడం, యూట్యూబ్ ద్వారా ప్రతిభను చూపించడం తప్పు కాదు. కానీ వ్యక్తిగత జీవితంలోని ప్రతి అంశాన్ని బహిరంగం చేయడం, కుటుంబ సమస్యలను కంటెంట్‌గా మార్చడం, ప్రతి విషయానికీ నెటిజన్ల స్పందన కోసం ఎదురుచూడటం మాత్రం ఆలోచించాల్సిన అంశం. వ్యక్తిగత సమస్యకు పరిష్కారం కోసం సోషల్ మీడియా స్పందనపై ఆధారపడటం కంటే కుటుంబ సభ్యులు, నమ్మకమైన పెద్దలు, న్యాయ నిపుణులు, పోలీసులను ఆశ్రయించడం అవసరం. రీల్ కొన్ని సెకన్లది.. జీవితం ఒక్కటే. వ్యూస్ కంటే విలువలు ముఖ్యం.

**వార్త చెప్పాలి.. ఆవేశం పెంచకూడదు**

విషాద ఘటన జరిగిన వెంటనే వీడియోలు, ఇంటర్వ్యూలు, చర్చలు మొదలవుతాయి. ప్రజలకు సమాచారం అందించడం మీడియా బాధ్యతే. అయితే విషాదాన్ని సంచలనంగా మార్చకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. బాధితుల కన్నీళ్లు, ఆవేదనను పదేపదే చూపించడం వల్ల అవగాహన పెరుగుతుందా? లేక ఆవేశం పెరుగుతుందా? అనే ప్రశ్నను ప్రతి ఒక్కరూ వేసుకోవాలి. సమాజానికి సమాచారం అవసరం.. సంచలనం కాదు. అవగాహన అవసరం.. ఆవేశం కాదు.

**తల్లిదండ్రులు.. యువత గమనించాల్సిన అంశాలు**

పిల్లల చేతిలో సెల్‌ఫోన్ ఉండటం తప్పు కాదు. కానీ దాన్ని ఎలా వినియోగించాలో నేర్పడం అవసరం. ఏ కంటెంట్ చూడాలి? ఏ విషయాలను పంచుకోకూడదు? ఆన్‌లైన్‌లో వేధింపులు ఎదురైతే ఎవరిని ఆశ్రయించాలి? సోషల్ మీడియాలో వచ్చే ప్రతి మాటను ఎలా తీసుకోవాలి? అనే విషయాలపై తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడాలి.

**నిఘా కంటే స్నేహపూర్వక సంభాషణ ముఖ్యం.**

యువత కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆవేశంలో తీసుకున్న ఒక్క నిర్ణయం జీవితాంతం వెంటాడవచ్చు. ఒక కామెంట్, ఒక వీడియో, ఒక గొడవ, ఒక క్షణిక ఆవేశం.. ఇవేవీ ఒక ప్రాణం కంటే విలువైనవి కావు. అన్యాయం జరిగిందని భావిస్తే ప్రతీకారానికి వెళ్లకుండా కుటుంబ సభ్యులు, పెద్దల సలహా తీసుకోవాలి. పోలీసులను, న్యాయ నిపుణులను ఆశ్రయించాలి. చట్టపరంగా న్యాయం కోసం పోరాడాలి. ప్రతీకారం ధైర్యం కాదు.. చట్టబద్ధంగా న్యాయం కోసం నిలబడటమే బాధ్యత. వైష్ణవి ఘటనలో ఎవరి తప్పు ఎంత? ఎవరి పాత్ర ఏమిటి? అన్నది దర్యాప్తు, న్యాయస్థానాలు తేల్చాల్సిన అంశం. అయితే ఈ ఘటన మన ముందుంచిన సామాజిక ప్రశ్న మాత్రం స్పష్టం.

**ఒక కుటుంబానికి జరిగిన విషాదం మరో కుటుంబాన్ని నాశనం చేయకూడదు.**

ఒక ప్రాణం పోయిన తర్వాత మరో ప్రాణాన్ని తీసుకోవడం వల్ల గత నష్టం తిరిగి రాదు. కానీ రెండు కుటుంబాల్లో మాత్రం శాశ్వతమైన విషాదం మిగులుతుంది. ప్రతీకారం ఆవేదనకు ఉపశమనం ఇవ్వకపోగా.. కొత్త బాధితులను సృష్టిస్తుంది. అందుకే న్యాయం కోసం చట్టాన్ని ఆశ్రయిద్దాం.. ప్రతీకారం కోసం ప్రాణాలు తీయవద్దు. సోషల్ మీడియాను వినియోగిద్దాం.. కానీ దాని చేతిలో మన ఆలోచనలను పెట్టవద్దు. మరో కుటుంబం కన్నీరు పెట్టుకున్న తర్వాత స్పందించడం కంటే.. అలాంటి విషాదం మళ్లీ జరగకుండా చూడటమే నిజమైన సామాజిక బాధ్యత.



**జి. అజయ్ కుమార్**

# సంపాదకీయం

## ఎస్ఐఆర్.. ఓటు హక్కు రక్షణకు పరీక్షా సమయం

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక సాధారణ హక్కు కాదు. అది పౌరుడి స్వరానికి రాజ్యాంగం ఇచ్చిన విలువ. ప్రభుత్వాలను ఎన్నుకునే అధికారం ప్రజల చేతిలో ఉండాలంటే ముందుగా ఓటర్ల జాబితా విశ్వసనీయంగా ఉండాలి. ఎవరు అర్హులైన ఓటరో వారి పేరు జాబితాలో ఉండాలి. అర్హత లేని వ్యక్తుల పేర్లు ఉండకూడదు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, ఒకటికంటే ఎక్కువ చోట్ల నమోదైన వారు వంటి వివరాలు కూడా ఎప్పటికప్పుడు సరిచేయాలి. ఈ లక్ష్యంతో ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియే ఎస్ఐఆర్. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం, తప్పులను సరిదిద్దడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా చూడడం దీని ప్రధాన ఉద్దేశం అని ఎన్నికల సంఘం చెబుతోంది.

అయితే ఓటర్ల జాబితా సవరణ అనే ప్రక్రియ ఎంత ముఖ్యమో, దానిని నిర్వహించే విధానం అంతకంటే ముఖ్యమైనది. ఎందుకంటే ఒకరి పేరు జాబితాలో ఉండటం లేదా లేకపోవడం నేరుగా ఆయన ప్రజాస్వామ్య హక్కును ప్రభావితం చేస్తుంది. అందుకే ఎస్ఐఆర్ విషయంలో ఒకవైపు నకిలీ, ద్వంద్వ, అనర్హమైన నమోదులను తొలగించాలన్న లక్ష్యం ఉంటే, మరోవైపు నిజమైన, అర్హత కలిగిన ఓటరు పేరు పొరపాటున తొలగిపోకుండా అత్యంత జాగ్రత్త అవసరం. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతే ఎస్ఐఆర్ విజయానికి అసలు కొలమానం.

భారతదేశం వంటి విస్తారమైన దేశంలో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు తాజా స్థితిలో ఉంచడం చిన్న పని కాదు. జనాభా నిరంతరం మారుతోంది. గ్రామాల నుంచి పట్టణాలకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ప్రజలు వలస వెళ్తున్నారు. నగరాల్లో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. పాత నివాసాలు మారుతున్నాయి. ఒకే వ్యక్తి ఉద్యోగం, విద్య, కుటుంబ కారణాలతో అనేక ప్రాంతాల్లో నివసించే పరిస్థితి ఏర్పడుతోంది. మరణించిన వారి పేర్లు తొలగించడంలో ఆలస్యం కావచ్చు. వివాహం, ఉద్యోగం, వలస వంటి కారణాలతో చిరునామాలు మారినా రికార్డుల్లో పాత వివరాలు కొనసాగవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటర్ల జాబితా ఒకసారి తయారుచేసి శాశ్వతంగా అలాగే ఉంచడం సాధ్యం కాదు. నిరంతర సవరణ అవసరం.

అయితే ప్రత్యేక సమగ్ర సవరణ సాధారణ సవరణ కంటే విస్తృతమైన ప్రక్రియ. ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించడం, ఓటర్ల నుంచి నిర్దేశిత వివరాలు సేకరించడం, అవసరమైన చోట ధ్రువీకరణ చేయడం, ముసాయిదా జాబితా ప్రచురించడం, అభ్యంతరాలు స్వీకరించడం, వాటిని పరిశీలించడం, తుది జాబితాను రూపొందించడం వంటి అనేక దశలు ఇందులో ఉంటాయి. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి గణన పత్రాలను అందజేయడం, సేకరించడం, అవసరమైన పరిశీలన చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు.

ఇక్కడే పౌరుల బాధ్యత కూడా మొదలవుతుంది. ఓటరు జాబితాలో తన పేరు ఉందని భావించి ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రానికి వెళ్లడం మాత్రమే సరిపోదు. తన పేరు, వయసు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, ఓటరు గుర్తింపు వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనేది ముందుగానే చూసుకోవాలి. పేరు లేకపోతే దానికి కారణం తెలుసుకోవాలి. తప్పు ఉంటే సరిచేయించుకోవాలి. కొత్తగా అర్హత పొందిన వారు నమోదు చేసుకోవాలి. నివాసం మారిన వారు వివరాలను మార్చుకోవాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఎంత మంచి సవరణ ప్రక్రియ చేపట్టినా దాని ఫలితం పూర్తిస్థాయిలో సాధ్యం కాదు.

ఎస్ఐఆర్ చుట్టూ చర్చకు మరో ముఖ్య కారణం పత్రాల ధ్రువీకరణ. ఓటర్ల జాబితా కేవలం పేర్ల సమాహారం కాదు. అందులో నమోదైన ప్రతి వ్యక్తి అర్హతను నిర్ధారించే విధానం కూడా ఉండాలి. అదే సమయంలో పత్రాలు సమర్పించలేని నిజమైన పౌరుడు కేవలం ప్రక్రియలో ఇబ్బంది ఎదుర్కొన్నందుకు ఓటు హక్కును కోల్పోకూడదు. ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు, దివ్యాంగులు, వలస కార్మికులు, నిరాశ్రయ పరిస్థితుల్లో ఉన్నవారు, పత్రాలు పోగొట్టుకున్నవారు వంటి వర్గాలకు ప్రత్యేక సహాయం అవసరం. ఎన్నికల ప్రక్రియలో సమానత్వం అంటే అందరికీ ఒకే నియమం పెట్టడం మాత్రమే కాదు; ఆ నియమాన్ని ప్రతి అర్హుడూ ఉపయోగించుకునేలా అవసరమైన సహకారం అందించడం కూడా. ఇటీవల ఎస్ఐఆర్ చట్టబద్ధతపై జరిగిన న్యాయపరమైన చర్చలు కూడా ఈ ప్రక్రియ ప్రాధాన్యాన్ని చూపిస్తున్నాయి. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై దాఖలైన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు 2026 మే 27న ఎన్నికల సంఘానికి ప్రత్యేక సవరణ చేపట్టే అధికారం ఉందని, ఆ ప్రక్రియకు చట్టపరమైన ఆధారం ఉందని, ఎన్నికల జాబితా ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడం చట్టబద్ధమైన లక్ష్యమని పేర్కొంది. అదే సమయంలో అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తప్పించే ప్రమాదం లేకుండా ప్రక్రియలో ఉన్న రక్షణలను కూడా కోర్టు పరిశీలించింది.

ఈ తీర్పు ఒక విషయం స్పష్టం చేస్తుంది. ఓటర్ల జాబితా సవరణ చేయడం ఎన్నికల సంఘానికి ఉన్న సాధారణ పరిపాలనా పని మాత్రమే కాదు; అది రాజ్యాంగబద్ధమైన ఎన్నికల వ్యవస్థలో కీలకమైన బాధ్యత. అదే సమయంలో ఆ అధికారాన్ని వినియోగించే విధానం పారదర్శకంగా, న్యాయబద్ధంగా, ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. ఓటరు పేరు ఎందుకు తొలగించబడిందో తెలుసుకునే అవకాశం ఉండాలి. తన వాదన వినిపించే అవకాశం ఉండాలి. తప్పు జరిగితే దాన్ని సరిచేసుకునే మార్గం ఉండాలి. ఇలాంటి రక్షణలు ఉన్నప్పుడే సవరణ ప్రక్రియపై ప్రజల విశ్వాసం పెరుగుతుంది.

ఎస్ఐఆర్ విషయంలో రాజకీయ వాదోపవాదాలు సహజమే. ఓటర్ల జాబితా అనేది ఎన్నికల ఫలితాలతో నేరుగా సంబంధం ఉన్న అంశం కావడంతో రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలు, ప్రజా సంఘాలు దీనిపై ప్రశ్నలు లేవనెత్తుతాయి. అయితే ఈ చర్చ వ్యక్తులపై ఆరోపణల స్థాయికి పరిమితం కాకుండా ప్రక్రియపై ఉండాలి. ఏ పేరు ఎందుకు తొలగించారు? ఏ పత్రం ఎందుకు కోరుతున్నారు? ఎవరికి మినహాయింపు ఉంది? అభ్యంతరం ఎలా చెప్పాలి? తప్పు జరిగితే ఎక్కడ అప్పీల్ చేయాలి? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. అప్పుడే ప్రజాస్వామ్య చర్చ ఆరోగ్యకరంగా సాగుతుంది.

ఎన్నికల సంఘం ప్రకటించిన లక్ష్యం కూడా ఇదే దిశలో ఉంది. అర్హత కలిగిన పౌరుడు ఒక్కరూ మిగలకూడదు, అనర్హుడు ఒక్కరూ చేరకూడదు అన్నదే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రధాన ఉద్దేశంగా పేర్కొంది. ఈ లక్ష్యం కాగితంపై ఎంత సరళంగా కనిపించినా, ఆచరణలో చాలా క్లిష్టమైనది. ఎందుకంటే 'అర్హుడు' అనే అంశాన్ని నిర్ధారించే క్రమంలో పొరపాటు జరిగితే దాని ప్రభావం ఒక వ్యక్తి ఓటు హక్కుపైనే పడుతుంది. అందుకే తొలగింపు కంటే ముందుగా పరిశీలన, పరిశీలనకు ముందు సమాచారం, సమాచారానికి తర్వాత అభ్యంతరానికి అవకాశం ఉండాలి. ప్రజలకు సరైన సమాచారం అందించడం ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యంత కీలకం. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ఇంటింటికీ వెళ్లినా, పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, వలస కుటుంబాలు, అద్దె ఇళ్లలో నివసించే ప్రజలను చేరుకోవడం ప్రత్యేక సవాలు. చాలా మంది ఓటర్లు తమ పేరు ఏ పోలింగ్ కేంద్రానికి సంబంధించినదో కూడా తెలియని పరిస్థితి ఉంది. మరికొందరు ఓటరు గుర్తింపు కార్డు ఉన్నందున పేరు జాబితాలో తప్పకుండా ఉంటుందని భావిస్తారు. కానీ ఓటరు గుర్తింపు కార్డు ఉండటం మాత్రమే ప్రస్తుత జాబితాలో పేరు ఉన్నదనే హామీ కాదు. అందుకే ప్రతి ఓటరూ అధికారిక వేదికల్లో తన వివరాలను పరిశీలించుకోవాలి. ఎన్నికల సంఘం ఓటర్ల సేవల వేదికలో పేరు శోధించడం, వివరాల సవరణ, దరఖాస్తు స్థితి తెలుసుకోవడం వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.మరో ముఖ్యమైన అంశం వలస. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లిన వ్యక్తి పాత ప్రాంతంలోనూ, కొత్త ప్రాంతంలోనూ పేరు కొనసాగితే అది ద్వంద్వ నమోదు సమస్యకు దారి తీస్తుంది. అదే సమయంలో పాత ప్రాంతంలోని పేరు తొ లగించిన తర్వాత కొత్త ప్రాం తంలో నమోదు ప్రక్రియ పూర్తి కాకపోతే ఆ వ్యక్తి ఎన్ని కల సమయం లో ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది.



**-గుర్రం పాపిరెడ్డి**
**-ఎడిటర్**

# క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ, రోగులకు మద్దతు ఇద్దాం!

**(22 సెప్టెంబర్ "ప్రపంచ క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంక్షేమ దినం లేదా ప్రపంచ రోజ్ దినం" సందర్భంగా)**

12 ఏండ్ల కెనెడియన్ చిన్నారి 'మిలిండా రోజ్' రక్త క్యాన్సర్ బారిన పడింది. క్యాన్సర్ రోగిగా కూడా అత్యంత ధైర్యంతో వ్యాధిని ఎదిరిస్తూ, క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి కవితలు, ఉత్తరాలు రాస్తూ ఉండేది. ఈ చిన్నారి చూపిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రేమ, కరుణ, సంఘీభావాలను గుర్తించిన ప్రపంచ పౌర సమాజం ప్రతి ఏట 22 సెప్టెంబర్ రోజున "ప్రపంచ రోజ్ దినం" లేదా "ప్రపంచ క్యాన్సర్ రోగుల సంక్షేమ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. రోజ్ పూలు ప్రేమకు, ఆప్యాయతకు చిహ్నంగా నిలుస్తాయి. క్యాన్సర్ రోగుల్లో ఆశావహ దృక్పథం, రోగాన్ని జయించగలమని నమ్మకాలను పెంచడానికి, ఈ ప్రమాదకర వ్యాధి పట్ల అవగాహన కల్పించడానికి ప్రపంచ రోజ్ దినం వేదికలు ఉపయోగపడుతున్నాయి. ప్రతి క్యాన్సర్ రోగి అనుభవ ప్రయాణం వేరుగా ఉన్నప్పటికీ ఆ రోగులు లేదా కుటుంబాలు పడే మనో వేదన మాత్రం ఒకే విధంగా ఉంటుంది. క్యాన్సర్ వ్యాధిని జయించిన వీరుల అనుభవాలను వివరించడం, దయ-కరుణ వర్షాలను కురిపించడం, రోగాన్ని జయించవచ్చనే భావనను వ్యాప్తి చేయడం, చికిత్సలో మెలకువలు పాటించడం, సహానుభూతితో అర్థం చేసుకోవడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.




**అతి ప్రమాదకర వ్యాధిగా క్యాన్సర్**

ఖచ్చితమైన చికిత్స అందుబాటులో లేని కారణంగా క్యాన్సర్ వ్యాధితో పెద్ద సంఖ్యలో రోగులు మరణించడం ఒక ప్రపంచ ప్రజారోగ్య సమస్యగా మారింది. శరీరంలోని ఏ భాగానికి చెందిన కణజాలమైనా నియంత్రణ లేకుండా అపరిమితంగా పెరగడంతో ట్యూమర్స్ ఏర్పడడంతో పాటు ఇతర శరీర కణజాలాలు కూడా విధ్వంసం చేయబడడాన్ని క్యాన్సర్ అని అర్థం చేసుకోవాలి. నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల్లో గుండె జబ్బుల (63.3 శాతం) తర్వాత 2వ అత్యధిక మరణాలకు కారణం అవుతున్న క్యాన్సర్ (18.1 శాతం) ఒక ప్రపంచ స్థాయి సమస్యగా గుర్తించబడింది. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో దినదినం పెరుగుతున్న క్యాన్సర్ కేసులు మన ప్రజారోగ్య విభాగాలకు సవాళుగా నిలుస్తున్నాయి. క్యాన్సర్లలో వందకు పైగా రకాలు ఉన్నప్పటికీ ఊపిరితిత్తులు, రొమ్ము, గర్భాశయ, ప్రోస్టేట్, చర్మం, జీర్ణనాళ క్యాన్సర్లు అతి ముఖ్యమైనవి. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా కనిపిస్తే, పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ మహిళలు, పురుషుల్లో కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. పిల్లల్లో (బాలలు, బాలికలు) లింఫోయిడ్ ల్యుకేమియా(రక్త) క్యాన్సర్ అధికంగా కనిపిస్తున్నది.

**క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంక్షేమ దినం**

ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్లు సంపూర్ణ అవగాహన కల్పించడానికి, నివారణ మార్గాలు, చికిత్స మార్గాలు, రోగ లక్షణాలు లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 04 ఏప్రిల్ రోజున "ప్రపంచ క్యాన్సర్ దినం" నిర్వహించుట 2000 సంవత్సరం నుంచి ప్రారంభం అయ్యింది. ఈ దినం ఇతివృత్తంగా "ఆశ మరియు మద్దతు తీసుకురండి (బ్రింగ్ హోప్ అండ్ సపోర్ట్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ క్యాన్సర్ రోగుల సంక్షేమ దినం వేదికగా క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడడం, రోగుల పట్ల ప్రేమ, ఆప్యాయతలను చూపడం, క్యాన్సర్ రోగాన్ని తొలి దశలో గుర్తించి వైద్య చికిత్సలు పొందడం, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు లాంటి అంశాలను ప్రపంచ మానవాళికి చేర్చడానికి విశ్వవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయడమే ఉత్తమ మార్గమని నిర్ణయించడం సముచితంగా ఉన్నది.

**క్యాన్సర్ కారణాలు, రోగ లక్షణాలు, చికిత్స మార్గాలు:**

క్యాన్సర్ వ్యాధి రావడానికి ముఖ్య కారణాలుగా జన్యు మార్పులు, అనువంశిక మార్గాలు, పొగ తాగడం, అధిక ఆల్కహాల్ సేవనం, స్థూలకాయం, పర్యావరణ కాలుష్యం, ప్రమాదకర రసాయనాలతో పని చేయడం, రేడియోషన్‌కు గురి కావడం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక వ్యాయామం కొరవడడం, నిశ్చల జీవనశైలి, ఆలస్యంగా గుర్తించడం, అవగాహన లోపం, పేదరికం, సూర్యకిరణాల్లో అతినీలలోహిత కిరణాలకు గురి కావడం లాంటివి పేర్కొనబడినవి. క్యాన్సర్ వ్యాధి రోగ లక్షణాల్లో గడ్డలు లేదా ట్యూమర్స్ ఏర్పడడం, బరువు తగ్గడం, రక్తస్రావం కలగడం, అలసట, చర్మ మార్పులు, దగ్గు, మలబద్ధకం, మింగడంలో అసౌకర్యం, గురక, అజీర్ణం, జ్వరం, రక్తహీనత, సంతానోత్పత్తి సమస్యలు, చమట పట్టడం, దురలవాట్లు, కుటుంబ చరిత్ర, నిరక్షరాస్యత లాంటివి వస్తాయి. క్యాన్సర్ నిర్ధారణలో రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు, ఎండోస్కోపీ లాంటివి వినియోగించబడుతున్నాయి. క్యాన్సర్ చికిత్సలో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యూనోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, హార్మోన్ థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ లాంటి విధానాలు అందుబాటులో ఉన్నాయి.

**క్యాన్సర్ నివారణ మార్గాలు లేదా తీసుకోవలసిన జాగ్రత్తలు**

క్యాన్సర్ రాకుండా చూసుకోవలసి జాగ్రత్తల్లో పోషకాహారం తీసుకోవడం, తరుచుగా పరీక్షలు చేయించుకోవడం, శరీర బరువు నియంత్రణలో ఉంచుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తులకు చరమగీతం పాడడం, శారీరక వ్యాయామం, టీకాలు తీసుకోవడం, ఇన్‌ఫెక్షన్ కాకుండా చూసుకోవడం, చురుకైన దిన చర్య పాటించడం, క్యాన్సర్ రిస్కులకు దూరంగా ఉండడం, సూర్యుడి అతినీలలోహిత కిరణాలు సోకకుండా జాగ్రత్త పడడం లాంటివి తప్పనిసరిగా పాటించాలి.

**భారత్‌లో కోరలు చాస్తున్న క్యాన్సర్ భూతం**

భారత్‌లో క్యాన్సర్ వ్యాధి 12 శాతం నుంచి 18 శాతం వరకు పెరగడం గమనించారు. మన దేశంలో క్యాన్సర్ వ్యాధిని ముదిరిన తర్వాత గుర్తించడం జరుగుతున్నందున క్యాన్సర్ కారణ మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. భారతీయుల జీవిత కాలంలో ప్రతి 9 మందిలో ఒక్కరికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. క్యాన్సర్ బూతం కోరలు చాచడంతో భారత వైద్య ఆరోగ్య శాఖకు సవాళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. భారత్‌లో ఐదేళ్ల పాటు గర్భాశయ క్యాన్సర్ వ్యాధి చికిత్స రేటు 51.7 శాతం, రొమ్ము క్యాన్సర్ 66.4 శాతంగా నమోదు అవుతున్నది. అన్ని రకాల క్యాన్సర్లలో ఊపిరితిత్తులు, గర్భాశయ, పాంక్రియాటిక్ క్యాన్సర్లు అతి ప్రమాదకరమైనవిగా గుర్తించబడినవి.

క్యాన్సర్ రోగులకు చికిత్సలు చేస్తున్న ఆంకాలజీ వైద్యులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, ప్యాథాలజిస్టులు, ఆంకాలజీ నర్సుల సేవలకు కృతజ్ఞతలు తెలిపే సందర్భంగా కూడా ప్రపంచ క్యాన్సర్ దినం వేదికలు ఉపయోగపడాలి. నిరక్షరాస్యత, పేదరికం, పోషకాహారలోపం లాంటి కారణాలతో మన దేశంలో క్యాన్సర్ అతిగా ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరు దీని పట్ల అవగాహన కలిగి ఉండడం, అవగాహన కల్పించడం నిరంతరం జరగాలి. క్యాన్సర్ రోగులు లేని భారతాన్ని నిర్మించే కృషి చేయాలి.

**- మధుపాళీ , 9949700037**

# రవాణా శాఖలో నూతన ఒరవడి

## మానుకోట జిల్లాలో మార్పుకు శంకర్ నాయక్ శ్రీకారం



అరుణప్రభ, సెప్టెంబర్ 20, మహబూబాబాద్ అర్బన్:లిలి మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శంకర్ నాయక్ రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, వాహనాల బీమా, ఫిట్‌నెస్, పర్మిట్లు, రోడ్డు పన్ను తదితర అంశాలపై వాహనదారులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు. రవాణా శాఖకు సంబంధించిన అనేక నిబంధనలపై వాహనదారులకు పూర్తి అవగాహన లేకపోవడంతో వాటిని వివరిస్తూ, నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించవచ్చో అధికారులు చైతన్యం కల్పిస్తున్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా చూడటం, వాహనాలకు అవసరమైన పత్రాలను సక్రమంగా నిర్వహించుకోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల బస్సుల విషయంలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఫిట్‌నెస్, పర్మిట్, బీమా తదితర పత్రాలు సక్రమంగా ఉండేలా పాఠశాలల యాజమాన్యాలకు సూచిస్తున్నారు. వాహన యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన రోడ్డు పన్ను, ఇతర పన్నులను సకాలంలో చెల్లించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి మార్గదర్శకత్వంలో ఎంవీఐలు, ఎఎంవీఐలు కూడా క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తూ వాహన తనిఖీలతో పాటు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, బీమా, ఫిట్‌నెస్, పర్మిట్లు, పన్నులు, మైనర్ల డ్రైవింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. రవాణా శాఖను కేవలం వాహన తనిఖీలకే పరిమితం చేయకుండా ప్రజలకు చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించడం, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం, వాహనాల పత్రాల నిర్వహణపై చైతన్యం కల్పించడం ద్వారా మానుకోట జిల్లాలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. శంకర్ నాయక్‌తో పాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో కీలకంగా నిలుస్తున్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నిజాంపేట్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతిగారి సుజాత--మల్లేష్ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో లినారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు నారాయణఖే మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ గారులి పాల్గొని, నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ... పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు లభించడంతో దొంతిగారి సుజాత--మల్లేష్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసిందని, వారి కొత్త జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు లింగ రెడ్డి నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,పండరి రెడ్డి నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ర్యలమడుగు గ్రామ సర్పంచ్ సాయిలు. రాధా కిషన్ సెట్, సుబుర్ కౌన్సిలర్,మల్లేష్,సాయిలు,వెంకటరములు,కిష్టయ్య, లక్ష్మయ్య,నాగయ్య ఉప సర్పంచ్,సాయిలు, తదితర ముఖ్య నాయకులు ర్యాలమడుగు గ్రామ ప్రజలు పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .



# టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి



సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారు నియమితులైన సందర్భంగా, లినారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిగారితో కలిసి సంగారెడ్డి పట్టణంలోని రామ్ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రామ్ మందిరంలోని వినాయక మండపంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. భజన కార్యక్రమం అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండరి రెడ్డి, విఠల్ రావు పాటిల్ నగల్ గిదధ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,యాదవ్ రెడ్డి మాజీ సర్పంచ్, సిద్ధ రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, రవీందర్ పాటిల్, నారాయణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల హక్కుల కోసం ఐక్య ఉద్యమం

## ఎస్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం

## జిల్లా అధ్యక్షులుగా సిద్దెల తిరుమలరావు ఏకగ్రీవ ఎన్నిక



అరుణ ప్రభ :- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీ ని రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ గాడ్ల ఆధ్వర్యంలో ఎన్ని కోవడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో 18,000 మంది కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రి నందు శానిటేషన్ , పేషెంట్ కేర్ , సెక్యూరిటీ , సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తూ సరైన గుర్తింపు లేక చాలీచాలని జీతాలతో జీవన విధానం వెళ్లదీ స్తున్నారు అని ఆవేదన వ్యక్తపరిచినారు 2022 జీవో ప్రకారము ఆనాడు ఇచ్చిన ఏజెన్సీ విధా నం మేరకు 15600/- జీతం ఉండగా చాలా ప్రభుత్వ ఆసుపత్రిలో హాస్పటల్ అధికారులు ఏజెన్సీ కాంట్రాక్టర్లు కుమ్మక్కై మా కార్మికులకు 10,000/- , 10, 500/- , 11,000/- జీతాలు ఇస్తున్నారు అని మండిపడినారు ఈపీఎఫ్ ఈఎస్ఐ కూడా కార్మికులకు కొన్ని ఏజెన్సీలో కట్టడం లేదు అని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శాఖ మంత్రి మరియు ఆరోగ్య శాఖ ఉన్నంత అధికారులు మా కార్మికులందరికీ కూడా ఐ ఎఫ్ ఎం ఎస్ లో విలీనం చేసి కనీస వేతనం నెలకు 26000 ఇవ్వాలి అని డిమాండ్ చేసినారు . తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల నందు మా కార్మికులందరినీ ఏకతాటి చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాము అని హెచ్చరించినారు. నూతనంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రూరా కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఈదునూరి అనిల్ గౌరవ సలహాదారులు అశ్వరావుపేట వెంకటేశ్వర్లు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ అధ్యక్షులుగా సిద్దేల తిరుమలరావు, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా దాట్ల శ్రావణ్ కుమార్ , జిల్లా కమిటీ కోశాధికారిగా దొంగరి హైమావతి , జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా దేవకరణ గంగా , టేకుల రమేష్. , జి . మమత జిల్లా కమిటీగా సహాయ కార్యదర్శిలు బండారి లక్ష్మి , కే . పవన్ , యం.డి వెంకటరమణ జిల్లా కమిటీ ప్రచార కార్యద ర్శులుగా బాలు , అనిత , భాగ్యలక్ష్మి తదితరులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా మాతంగి అనిల్ కుమార్ రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శి ప్రసాద్ రాష్ట్ర కమిటీ సభ్యులు చాగంటి నాగమణి సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షులు నాగభూషణం ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షులు బక్తుల మమత ఖమ్మం జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా గుగ్గిళ్ళ నాగేంద్ర ఖమ్మం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి గద్దల కళ్యాణి మరియు వివిధ ప్రభుత్వ ఆస్పటల్ నుండి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



# కిరాణా, బేకరీ షాపుల్లో పోలీసుల తనిఖీలు

## గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ ఆవరణల్లోని కిరాణా, బేకరీ తదితర దుకాణాల్లో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో సోమవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. దుకాణాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలను విక్రయించినట్లు తేలితే సంబంధిత దుకాణ యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ బృందం, కానిస్టేబుల్ సదుర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా నివారించేందుకు దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



# విఘ్నేశ్వరుని సన్నిధిలో అన్నదాన మహోత్సవం

## శ్రీ లక్ష్మీ గణపతి సేవలో ప్రగతి బుక్ స్టాల్

## పత్తి వెంకటేశ్వర రెడ్డి అండ్ బ్రదర్స్, ప్రగతి పెయింట్స్

సారపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక ఆర్చ్ వద్ద నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రగతి బుక్ స్టాల్--పత్తి వెంకటేశ్వర రెడ్డి అండ్ బ్రదర్స్, ప్రగతి పెయింట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు. నవరాత్రి ఉత్సవాలకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. రోజూ వెయ్యికిపైగా భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు. రూ.2 వేలకుపైగా విరాళాలు అందించే దాతల పేర్లను శిలాఫలకాలపై ముద్రిస్తున్నట్లు తెలిపారు.



# విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

## మేడే కాలనీ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

సారపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో మేడే కాలనీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా, స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లాస్య పల్ప్ ఇండస్ట్రీ అధినేత ఇంగువ రమేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహాయం అందించారు. కార్యక్రమంలో రవి, సాయిలక్ష్మి, చిన్న, గణేష్‌రెడ్డి, గద్దల వీరయ్య, హరిబాబు, మోహిత్, సీతమ్మ, కుమార్, అశోక్, శివ, శ్రావణ్ తదితరులు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

## పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్ ఆధ్వర్యంలో బాపూజీ గారి విగ్రహమునకు పూలదండలు పూజా కార్యక్రమాలు సమర్పించి నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులు చింత ఆనంద్ కుమార్, కార్యదర్శి చిల్వెరి వెంకటేశం, డైరెక్టర్లు గోనె శంకర్, చిలువేరి రవికుమార్, గడీల ప్రభాకర్, రుమాండ్ల రాజు, ముర్మురా శ్రీనివాస్, డాకూరి అశోక్, చింతా ఆదర్శ్, మునిపల్లి రామకృష్ణ, పోలా విజయ్, గుణాల సత్యం, మధునాల నర్సింలు, కొంగరి ప్రభు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.



# నూతన CC రోడ్డును ప్రారంభించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మండల పరిధిలోని లింగపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చందాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద మంజూరైన రూ. 5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును లిగౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారులి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి గ్రామానికి అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి వసతి కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రుక్మిణి హనుమశీడ్లు, పండరి రెడ్డి ఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సుబుర్ కౌన్సిలర్,నాగ్నాథ్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ రెడ్డి, నర్సింలు వార్డు మెంబర్, శంకర్,పంచాయతీ కార్యదర్శి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొప్పాపూర్ గ్రామ నాయకుడికే ఏఎంసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

### సీనియర్ కాంగ్రెస్ నాయకుడు

### కొండాపురం శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం కల్పించాలని రైతులు, కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఏర్పాటు కోసం గ్రామంలో స్థలం కేటాయించడంతో పాటు మార్కెట్ కార్యాలయ భవనం కూడా నిర్మించుకున్న నేపథ్యంలో, ఈసారి మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి బొప్పాపూర్ గ్రామానికి చెందిన నాయకుడికే ఇవ్వాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు. బొప్పాపూర్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు స్థలం కేటాయించి, మార్కెట్ కార్యాలయ నిర్మాణం కూడా చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు గ్రామానికి చెందిన నాయకులకు ఏఎంసీ అధ్యక్ష పదవి దక్కలేదని వారు పేర్కొంటున్నారు. గతంలో తిమ్మాపూర్, దుమాల, రాచర్ల గొల్లపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులకు మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవులు దక్కాయని, అయితే బొప్పాపూర్ గ్రామానికి మాత్రం అవకాశం రాలేదని గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం ఏఎంసీ అధ్యక్ష పదవి బీసీ మహిళకు రిజర్వ్ కాగా, నారాయణపూర్ గ్రామానికి చెందిన షేక్ సబేరా బేగం కొనసాగుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే నియామకంలో మరోసారి ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులకు అవకాశం ఇవ్వకుండా, బొప్పాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడికి పదవి కేటాయించాలని వారు కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న కొండాపురం శ్రీనివాస్‌రెడ్డికి ఏఎంసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని గ్రామానికి చెందిన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని రైతుల సమస్యలు, వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన అవసరాలపై అవగాహన ఉన్న స్థానిక నాయకుడికి పదవి దక్కితే మార్కెట్ అభివృద్ధితో పాటు రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. బొప్పాపూర్ గ్రామానికి చెందిన నాయకుడికి ఏఎంసీ అధ్యక్ష పదవి కేటాయించే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకత్వం పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా కుంకుమ పూజలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట పాత అంగడి బజార్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారికి కుంకుమ పూజలు చేశారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వినాయక మండపాన్ని దర్శించుకున్న జాలే నరసింహారెడ్డి

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని పీఏసీఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థుల ఆహ్వానం మేరకు మండపానికి చేరుకున్న ఆయన స్వామివారిని దర్శించుకుని దేవరకొండ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వవిద్యాలయ విద్యార్థులు నరసింహారెడ్డిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హరీష్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రోహిత్, శ్రీహరి, రోహిత్‌రెడ్డి, సురేష్, అభినాద్, దయాకర్, సాయినాథ్, సతీష్, ఆకాష్, దుర్గాప్రసాద్, గణేష్, భాస్కర్, కిట్టు, రాకేష్, దేవదాసు, లక్ష్మణ్‌తో పాటు విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## రోస్టర్ విధానాన్ని సవరించాలని మాల మహానాడు డిమాండ్

### ఎల్లారెడ్డిపేట ప్రజావాణిలో ఫిర్యాదు.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: రోస్టర్ విధానంలో మార్పులు చేయాలని, 99 జీవోను రద్దు చేసి 22 రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం ఎల్లారెడ్డిపేట ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులకు రోస్టర్ విధానం వల్ల అన్యాయం జరుగుతోందని మాల మహానాడు నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాల మహానాడు పిలుపు మేరకు ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేస్తున్నట్లు తెలిపారు. మాల వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రోడ్డ రామచంద్రం, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల రాజ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట హడాక్ కమిటీ అధ్యక్షులు ఎడ్ల సందీప్, ఎల్లారెడ్డిపేట అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రేసు జగన్, కిషన్‌దాస్‌పేట అధ్యక్షులు జీడి శ్రీనివాస్, అల్మాస్పూర్ ఉపసర్పంచ్ కొర్రి అనిల్‌కుమార్, లింగాల సందీప్, రామిండ్ల బాబు, లింగాల దాసు, బుర్కా ధర్మేందర్, మంత్రి రాజు, కే. వెంకటేష్, రేసు శంకర్, పెరమాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

### ఏజెన్సీ ప్రాంతాల్లో వివక్షకు తావులేదు: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సారపాక: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దంపతులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సారపాకలోని అవినాష్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలను అధికారులు ఇబ్బందులకు గురిచేయరాదని, వారికి సంబంధించిన సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని, అట్రాసిటీ కేసుల్లో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు పర్యవేక్షించాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలోనూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, నీలాదేవితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు రూ.50 వేల విలువైన స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

### విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి. సర్పంచ్ ఎనుగందుల నరసింహులు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం రూ.50 వేల విలువైన స్పోర్ట్స్ కిట్లను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎనుగందుల నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ సెల్‌ఫోన్లు పట్టుకుని సమయాన్ని వృథా చేయకుండా చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ మంచి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం



### అంగన్వాడీ అవసరాలు తెలుసుకున్న సర్పంచ్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నర్సింలు, ఈవో కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో అందుతున్న సేవలు, పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ సిబ్బందిని కేంద్రానికి అవసరమైన వసతులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన సౌకర్యాలను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఎనుగందుల నర్సింలు తెలిపారు. పిల్లలకు పోషకాహారం, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

### ఎల్లారెడ్డిపేట పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఎల్లారెడ్డిపేట పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ కోసం, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు వనం రమేష్, ఉపాధ్యక్షులు గాజుల దేవదాస్, సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ సుదర్శన్, యువజన సంఘం అధ్యక్షులు దోమల భాస్కర్, నాయకులు వనం ఎల్లయ్య, ఆడెపు గంగారాం, గోస్కే దేవదాస్, సిద్ధిరాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు.

### ఎల్లారెడ్డిపేట గిద్ద చెరువులో భారీ క్రేన్ ఏర్పాటు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో భారీ వినాయక విగ్రహాలు, కళ్యాణ మండపాలు ఏర్పాటు చేయడంతో నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు తెలిపారు. ఎల్లారెడ్డిపేటలోని గిద్ద చెరువులో భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం సులభంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం సహకారంతో భారీ క్రేన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని సర్పంచ్ నరసింహులు తెలిపారు. భక్తులు, నిర్వాహకులు నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించి అధికారులకు సహకరించాలని కోరారు.



## కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలి ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్ రెడ్డి

### ::: ఈషా డిజిటల్ సేవ ఆన్లైన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం- సెప్టెంబర్ 21 : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయి నుండి ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని ఎం.బి.ఆర్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈషా డిజిటల్ సేవా ఆన్ లైన్ సర్వీస్ సెంటర్ ను సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ... డిజిటల్ సేవల వల్ల మనం చెల్లించే ప్రతి పైసాకు లెక్క ఉంటుందని, అక్రమ లావాదేవీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించే విధంగా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని, వాటిని ఈషా డిజిటల్ సేవా కేంద్రం ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు. కేంద్రం పేదల కోసం 2 లక్షల గృహాలు మంజూరు చేసిందని, సోలార్ విద్యుత్ పథకం, ముద్ర లోన్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, రైతులకు ఫసల్ భీమా యోజన వంటి పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ వంటి ప్రతిష్టాత్మక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సరిగా సద్వినియోగం చేసుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇన్చార్జి బొక్క నరసింహారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాష, బిజెపి రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, బిజెపి రాష్ట్ర కిషోర్ మోర్చా కన్వీనర్ జక్కా రవీందర్ రెడ్డి, తాండ్ర రవీందర్, దన్న భాష, రమణారెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, బిజెపి కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

### గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో

# ఏకరూప దుస్తుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులను విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, మండల విద్యాధికారి గాలిపల్లి కృష్ణ హరితో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





## తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించిన సర్పంచ్

### ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆకాంక్ష

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండల నూతన తహసీల్దార్ ఆడెపు యువజ్యోతి (దివ్యజ్యోతి)ను ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలగందుల నరసింహులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింహులు తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలను పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు,
### సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం



అరుణ ప్రభ:– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీఓ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ముసలిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు సింగారం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి 30 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబం కల అని, ఆ కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహ నిర్మాణ పథకాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.అలాగే అనారోగ్యం, వైద్య ఖర్చులు వంటి ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 11 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు వైద్యం భారంగా మారకుండా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేవలం ఆర్థిక సహాయం అందించడానికే కాకుండా పేద కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల వేణు,మండల నాయకులు,మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి,సర్పంచులు బాదం వెంకటేశ్వర రెడ్డి, మందా నాగరాజు, పూణెం సురేందర్, బానోత్ పద్మ, బొర్ర సుభద్ర,ఉప సర్పంచ్ లు గుండె వెంకన్న, పొక్కుల రవి, పి ఆర్ ఏ ఈ చారి, మండల హౌసింగ్ శాఖ ఏఈ ఉదయ్ కిరణ్, మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్, నాయకులు , కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి సన్నిధికి భక్తిశ్రద్ధలతో పాదయాత్ర

### నూకల అభినవ్ రెడ్డి మొక్కు పాదయాత్రలో పాల్గొన్న
### ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్



సీరోల్ /అరుణప్రభ : పురుషోత్తమాయగూడెం నుంచి కురవి శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వరకు నూకల నరేష్ రెడ్డి తనయుడు నూకల అభినవ్ రెడ్డి చేపట్టిన మొక్కు పాదయాత్ర భక్తిశ్రద్ధలతో కొనసాగింది. సోమవారం నిర్వహించిన ఈ పాదయాత్రలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ పాల్గొని అభినవ్ రెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనడంతో పాదయాత్ర సందడిగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, నూకల అభినవ్ రెడ్డి శ్రీ వీరభద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూకల అభినవ్ రెడ్డిని, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు ఘనంగా సన్మానించి శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్, కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్రకుమార్, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకటరెడ్డి, కురవి మండల సమన్వయ కమిటీ అధ్యక్షులు అంబటి వీరభద్రం, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, వాగ్య నాయక్, తుకారం నాయక్, దొంగల జనార్దన్ రెడ్డి, చుంచు శేఖర్‌తో పాటు సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులు, యూత్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో కానిస్టేబుల్ కుచ్చు టోపీ

### 11లక్షల రూపాయలు మోసం.. బాధితుడు అవేదన



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): చిల్లకూరు మండల పరిధిలోని తిక్కవరం గ్రామానికి చెందిన పచ్చా వెంకట రమణయ్య న్యాయం చేయండని వేడుకున్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా బాధితుడు పచ్చా వెంకట రమణయ్య మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన జగన్నాటి మస్తానయ్య అనే హెడ్ కానిస్టేబుల్ మా దగ్గర హోమ్ గార్డ్ పోస్టులు ఉన్నాయని , వాటిని ఇప్పిస్తానను అని చెప్పి సుమారు 11 లక్షల రూపాయలను నాగేంద్ర అనే వ్యక్తికి ఫోన్ పే, బ్యాంకు అకౌంట్ కు వేయించాడని తెలిపారు. సుమారు సంవత్సరం కావస్తున్న నేటి కి ఉద్యోగాలు ఇప్పించలేదని వా పోయారు. మేము పలుమార్లు ఆయనను అడిగిన మీ దిక్కున్న చోటు చెప్పుకోండి అని చెప్పారు అన్నారు. పోలీస్ స్టేషన్ లకు తిరిగిన న్యాయం జరగలేదన్నారు. దయ చేసి మా డబ్బులను మాకు ఇప్పించాలని బాధితుడు వేడుకొన్నారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ మాట్లాడుతూ హోమ్ గార్డ్ఉద్యోగాలు ఇప్పిస్తాను అని చెప్పి తిక్కవరం గ్రామానికి చెందిన పచ్చా వెంకటరమణయ్య దగ్గర సుమారు 11లక్షల రూపాయలు ను కానిస్టేబుల్ జగన్నాటి మస్తానయ్య అనే వ్యక్తి నాగేంద్ర అకౌంట్ కి వేయించారని తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వక పోగా బాధితులకు తిరిగి నగదు చెల్లించలేద్దన్నారు. ప్రజలు రక్షించాల్సిన పోలీస్ లే మోసానికి పాల్పడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాధితుని కి న్యాయం చేయాలని తెలిపారు. లేని పక్షంలో సీపీఐ ఆద్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సి. వి.ఆర్. కుమార్, పచ్చా వెంకటరమణయ్య, కిష్టమ్మ , తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

### నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలి
### పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
### ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్



అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ పనులు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సంబంధిత ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా.మురళి నాయక్ సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## శివపరాశక్తి పీఠంలో
## వైభవంగా విశేష సోమవారం పూజలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని శ్రీ శివపరాశక్తి పీఠంలో పవిత్ర సోమవారాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పీఠం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివపరాశక్తి స్వామివారికి పంచామృతాలతో పాటు సుగంధభరిత గంధం, పవిత్ర విభూతితో ప్రత్యేక మహాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. స్వామివారికి సమర్పించిన దివ్య సప్తహారతులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సప్తహారతుల దర్శనంతో పీఠం అంతా ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పూజ్యశ్రీ శ్రీ శ్రీ మనోహర్ రాజు గురూజీ భక్తులకు ఆశీస్సులు అందజేశారు. శివపరాశక్తుల కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై సదా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, సకల శుభాలతో జీవించాలని ఆశీర్వదించారు. సోమవారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు శివనామస్మరణతో ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. పూజా కార్యక్రమాలు భక్తులకు మనశ్శాంతిని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించాయని నిర్వాహకులు తెలిపారు.




## ఎస్సీ, ఎస్టీల సమస్యలపై బక్కి వెంకటయ్య భరోసా
### సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా

అరుణ ప్రభ:– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు సారపాకలో ఘన స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన తొలుత భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సారపాకలోని అవినాశ్ రెసిడెన్సీ అధినేత పాటి అశోక్ ఆహ్వానం మేరకు అక్కడికి చేరుకున్న బక్కి వెంకటయ్యను ఎస్సీ, ఎస్టీ యువత కలుసుకుని తమ సమస్యలను వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న ఆయన, పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తదుపరి ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్న కమిషన్ చైర్మన్‌ను సారపాక ఎస్టీ కాలనీ, మోతే పట్టి నగర్, చింతకుంట గ్రామాలకు చెందిన పెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బక్కి వెంకటయ్యను కోరారు. ప్రజల వినతులపై స్పందించిన బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తానని హామీ ఇచ్చారు.



## బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి: జిల్లా ఎస్ పి పరితోష్ పంకజ్ ఐపిఎస్

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కరానికై సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ., వారితో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత ఎస్ హెచ్ ఓ లతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్య జాప్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి సమస్యలకు చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎస్పీ తెలిపారు.



## పోలీసులమంటూ బంగారు వ్యాపారులకు
# డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు

### రూ.4.20 లక్షల వరకు అక్రమ వసూళ్లు..
### నల్గొండకు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

లిలిఅరుణప్రభ, మహబూబాబాద్, సెప్టెంబర్ 21:లిలి పోలీసులుగా నటిస్తూ బంగారు వ్యాపారులను ఫోన్‌లో బెదిరించి 'డిజిటల్ అరెస్ట్' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్, పోలీసు యూనిఫాం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. నల్గొండ జిల్లా నిడమనూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్ (29), చింతలచేరువు ప్రశాంత్ (26)ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇర్ఫాన్ పోలీసు యూనిఫాం ధరించిన ఫొటోను వాట్సాప్, ట్రూకాలర్ డీపీలుగా ఉపయోగించి, కేసముద్రం మండలానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాలచారికి ఫోన్ చేశాడు. తాను పోలీసు అధికారినని పరిచయం చేసుకుని, దొంగిలించిన బంగారం కొనుగోలు చేశారంటూ బెదిరించాడు. అరెస్ట్ చేస్తామని భయపెట్టి వాట్సాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ పంపి రూ.88,026 వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సైబర్ క్రైమ్ వివరాలు, బ్యాంకు లావాదేవీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, ఎస్ఐ కె. క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఇద్దరినీ అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు బంగారు వ్యాపారులను ఇదే తరహాలో బెదిరించి, ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు సుమారు రూ.4.20 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. పోలీసుల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, క్యూ ఆర్ కోడ్‌ల ద్వారా డబ్బుల డిమాండ్లకు స్పందించవద్దని ఎస్పీ డా. శబరీష్ సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే లిలి1930లిలికు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# సర్-2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

**ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి**

**అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**



అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు సోమవారం, హైదరాబాదు నుంచి ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం–6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం–6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై, సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, వేగవంతం చేయాలని స్పష్టం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, డి ఆర్ ఓ నాగలక్ష్మి, ఆర్డీవోలు రాజేశ్వరి గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, సూపర్డెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# వాలిబాల్, ఖో-ఖో క్రీడల నిర్వహణకు సింగిరెడ్డి పద్మారెడ్డి ఆర్థిక సహాయం

**బోడుప్పల్ ప్రభుత్వ పాఠశాలలో వాలిబాల్, ఖో-ఖో క్రీడల సెలక్షన్స్**

**20,000/-రూపాయలను**
**ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్ కు అందించిన సింగిరెడ్డి**

**అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి**



సెప్టెంబర్ 21, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఘట్కేసర్ జోన్ ఆధ్వర్యంలో అండర్--14, అండర్--17 బాలబాలికల వాలిబాల్, ఖో–ఖో క్రీడల సెలక్షన్స్, టోర్నమెంట్స్ ను సెప్టెంబర్ 22, 23 తేదీలలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడల నిర్వహణ, క్రీడాకారులకు మేమేంటోల నిమిత్తం మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి 20,000/- రూపాయల విరాళాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి అశోక్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలు దొరికినట్లు సరైన అవకాశాలు లేక చాలామంది క్రీడాకారులు మరుగున పడిపోతున్నారని, అలాంటి వారి కోసం వాలీబాల్, ఖో–ఖో క్రీడల సెలక్షన్స్, టోర్నమెంట్స్ నిర్వహించడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని సింగిరెడ్డి పద్మా రెడ్డి ఆకాంక్షించారు. అందరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని విద్యార్థులందరూ సెలక్షన్స్ లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బావి భారత క్రీడాకారులను తయారు చేయడం కోసం క్రీడల నిర్వహణ, జ్ఞాపకాల కోసం 20వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు క్రీడల నిర్వహణకు విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోడుప్పల్ ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్, సీనియర్ ఉపాధ్యాయులు పి. వెంకటేశ్వర్, కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి రాజిరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో గణనాథునికి ప్రత్యేక పూజలు

**భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన కార్యక్రమం.**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిది. : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణనాథునికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టే ప్రతి కార్యం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా మహాగణపతి ఆశీర్వదించాలని కోరుకున్నట్లు చెప్పారు.

**ఘనంగా గణనాథుని శోభాయాత్ర**

గత ఏడు రోజులుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎస్పీ మహేష్ బి. గితే శోభాయాత్రను ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు, ఆటపాటలతో గణనాథునికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. అనంతరం గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంలో సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# గోల్డెన్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎడ్ల అంగడి బజారులో గోల్డెన్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు గోల్డెన్ ఫ్రెండ్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండవ వార్డు సభ్యురాలు మల్లారం మానస రాజేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు నరేందర్, సాయికిరణ్, శ్రీరామ్, అరుణ్, విష్ణు, ధనుష్, వంశీ, మణిదీప్, అజయ్, రోహిత్, దినేష్, పవన్, విజయ్, భరత్, పూర్ణ, రాకేష్, రంజిత్, వేణు, భాను తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 26న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

**కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను సెప్టెంబర్ 26, 2026న కంబాలపల్లి చెరువు వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు మహబూబాబాద్ జిల్లాలోని సహజ సౌందర్యం, చెరువులు, జలపాతాలు, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రదేశాలను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు, జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు కంబాలపల్లి చెరువుతో పాటు బయ్యారం చెరువు, గుంజేడు ముసలమ్మ దేవాలయం, కురవి వీరభద్ర స్వామి దేవాలయం, బీముడి పాదం జలపాతం తదితర పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సుందరీకరణ, సందర్శకులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళలు, సంప్రదాయాలు మరియు జిల్లా సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు కలెక్టర్ తెలిపారు పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, స్థానిక కళాకారులు, హస్తకళాకారులు, చిన్న వ్యాపారులు మరియు ఇతర వర్గాలకు ఆర్థిక అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు జిల్లా ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పర్యాటక రంగానికి చెందినవారు, అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. "మహబూబాబాద్ జిల్లా ప్రకృతి సౌందర్యం, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రపంచానికి పరిచయం చేసి, పర్యాటక రంగం ద్వారా స్థానికంగా ఉపాధి మరియు ఆర్థిక అవకాశాలను పెంపొందించడమే లక్ష్యం" అని జిల్లా కలెక్టర్ తెలిపారు. తేదీ: 26 సెప్టెంబర్ 2026 వేదిక: కంబాలపల్లి చెరువు, మహబూబాబాద్ జిల్లా కార్యక్రమం: ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లాలోని యువత, ప్రజలు, పర్యటకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ సోమవారం ఒక్క ప్రకటనలో తెలిపారు



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో ఎమ్మెల్యే మురళి నాయక్ సమీక్ష**

అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ తన క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగు తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సమీక్షించి, అవసరమైన చోట సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# నిరుద్యోగులకు జాబ్ మేళా



అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్.21 : హైదరాబాద్‌లోని "అపోలో ఫార్మసీ" సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 23, 2026న మహబూబాబాద్‌లోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు లిజిల్లా ఉపాధి కల్పనాధికారి టి. రజితలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ" సంస్థలోని ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ 18 – 35 సంవత్సరాలు (స్త్రీ / పురుషులు) వయసు కలిగి అభ్యర్థులు ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్ పోస్టులకు డి .ఫార్మసీ / బి .ఫార్మసీ / ఎం .ఫార్మసీ (తెలంగాణ పీసీఐ సర్టిఫికేట్ ఉండవలెను) ఫార్మసీ అసిస్టెంట్ పోస్టునకు 10వ తరగతి / ఇంటర్మీడియట్ / డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ వివరాలు, ధ్రువపత్రాలతో సెప్టెంబర్ 23న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, మహబూబాబాద్ నందు జరిగే జాబ్ మేళాకు హాజరు కావాల్సిందిగా ఈ సందర్భంగా అధికారి కోరారు



# శివశక్తి నగర్ కాలనీ పేస్ 1 లో విశ్వకర్మ సంఘం జయంతి

సెప్టెంబర్ 21, అరుణ ప్రభ ని శివశక్తి నగర్ కాలనీ పేస్ 1 లో విశ్వకర్మ సంఘం జయంతి సందర్భంగా అన్నప్రాసదా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు, పూజలో పాల్గొన పెద్దలు, ప్రముఖులు, ఈ కార్యక్రమానికి బజ్జూరు శ్రీనివాస్ గుప్తా పూజా కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాళ్లబండి రమణచారి, కార్యదర్శి వెంకటాపురం గోపి చారి, కోశాధికారి కలకోటి సత్యనారాయణ చారి, ఉపాధ్యక్షులు బాగాల బాలాచారి సలహాదరులు ఎర్రోజు విజయ భాస్కర, చారి బెంజంకి రవి చారి ఉప కార్యదర్శి దేవరకొండ నరేందర్ చారి,కార్యవర్గ సభ్యులు పగిడి పెల్లి వెంకట చారి,రాళ్లబండి శంకర్ చారి, దాసోజు నర్సిహ చారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**గ్రీవెన్స్ డేలో 19 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ మహేష్ బి. గితే**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 19 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం, భరోసా కలిగేలా సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు.

# అయ్యవారి గూడలో నీటి సమస్యకు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి (బంటి) చొరవతో శాశ్వత పరిష్కారం



అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 21: యాచారం మండలం అయ్యవారి గూడ గ్రామంలో నీటి సమస్య ఉందని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి), ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో బోర్ వేయించి నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. ప్రజల సమస్య ఏదైనా... పరిష్కారం కోసం ముందుండే బంటి సేవా దృక్పథానికి అయ్యవారి గూడ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు, గ్రామస్థులు బంటికి కృతజ్ఞతలు తెలిపారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, సెప్టెంబరు 22, 2026

# నిజాం చెరువు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మురళి నాయక్

## నిమజ్జనంలో ఎటువంటి లోపాలు ఉండొద్దు
## అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మున్సిపల్ చైర్పర్సన్



అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గణేశుని నిమజ్జనాల సందర్భంగా నిజాం చెరువును సంబంధిత పోలీస్ శాఖ అధికారులతో మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి జరుగుతున్న పనులను పర్యవేక్షించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ తోపాటు మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైర్మన్ మాట్లాడుతూ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుధ్యం, విద్యుత్, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ మానుకోట అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మురళి నాయక్ సహకారంతో ఈ యొక్క పట్టణ కేంద్రాన్ని ఈ నిజాం చెరువు వద్ద ఉన్న సమస్యలను, నిమజ్జన సమయంలో ఎదురయ్యే ఆటంకాలను పరిష్కరించి, చెరువును మరింత అభివృద్ధి చేసి పూర్తిస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని , చైర్మన్ జ్యోతి రమేష్ నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే బతుకమ్మ పండుగ సమయములో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్నేరు వాగు వద్ద బతుకమ్మ ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, త్వరలోనే పనులను ప్రారంభించి ఎమ్మెల్యే ఆశీస్సులతో పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని వారు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ, భక్తులకు మరియు ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వైస్ చైర్మన్ సువర్ణపు సోమయ్య, మున్సిపల్ కమిషనర్, వినోద్ కుమార్,డీస్పీ తిరుపతి రెడ్డి,సి ఐ అంజలి, డి ఇ ఉపేందర్,ఏ ఇ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ, పాలు వార్డుల కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్లు, బొల్లు రాజు, పద్మ ప్రవీణ్, మహమ్మద్ ఖలీల్, సాల్వాయి దిలీప్, కాటా భాస్కర్, బానోత్ భాస్కర్, బద్దెపూరి గోపీనాథ్, నిమ్మల శ్రీను, జిల్లా నాయకులు ఎడ్ల రమేష్, సతీష్ రావు, రెడ్డియాల శీను,మున్సిపల్ శాఖ సిబ్బంది పోలీస్ శాఖ సిబ్బంది, పట్టణ నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు,మండల అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# మేడే కాలనీ ప్రజల ఏళ్లనాటి కాలువల సమస్యకు మోక్షం

## ప్రారంభమైన డ్రైనేజీ నిర్మాణ పనులు



అరుణ ప్రభ :- సారపాక పరిధిలోని మేడే కాలనీ ప్రజల ఏళ్లనాటి మురుగు నీటి కాలువ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్ గూగులోత్ కిషోర్ (శివరాం నాయక్), ఈరోజు (సోమవారం) డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన పనులకు భూమిపూజ చేసి, నిర్మాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ మేడే కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రైనేజీ అని, వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోయి రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రహించి ప్రాధాన్యత క్రమంలో ఈ పనులను మంజూరు చేయించినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. ఏళ్ల తరబడి మురుగునీటి సమస్యతో అవస్థలు పడుతున్న తమ ఇబ్బందిని అర్థం చేసుకొని, వెంటన స్పందించి డ్రైనేజీ నిర్మాణానికి పూనుకున్నందుకు మేడే కాలనీ ప్రజలు, స్థానిక పెద్దలు సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ పి ఎస్ పి డి భద్రాచలం యూనిట్ డీజీఎం చెంగల్ రావు, 15వ వార్డు మెంబర్ భుక్య కళ్యాణి, సిపిఎం పార్టీ మండల అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కాలనీ పెద్దలు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

## శోభాయాత్రలో డీజే లకు అనుమతి లేదు: డీఎస్పీ నంబూరు తిరుపతిరావు




అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలో 23-09-2026, బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జనం సందర్భంగా నిజాం చెరువు (బతుకమ్మ కుంట) వద్ద నిమజ్జన కార్యక్రమంతో పాటు గణేష్ శోభాయాత్ర సాగే మార్గాల్లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ నంబూరు తిరుపతి రావు తెలిపారు నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బందిని కీలక ప్రాంతాల్లో మోహరించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ ద్వారా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శోభాయాత్రలో డీజే లకు ఎలాంటి అనుమతి లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. డీజే లు ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, భక్తులు మరియు ప్రజలు పోలీస్ శాఖ సూచనలు, భద్రతా నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ సీఐ ఎన్ . అంజలి, టౌన్ ఎస్ ఐ లు గడ్డం ఉమ, బి . అంజమ్మ, యూ . సూరయ్య లు పాల్గొన్నారు.

# జి సి ఏ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ

## ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు: ఎస్సై మేడా ప్రసాద్



అరుణ ప్రభ :- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని గౌతమీపురం జి.సి.ఏ. యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద దాతలు పెరుమళ్ళ దారుగ, సంధ్య దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎస్సై మేడా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి సన్నిధిలో భక్తులకు అన్నం పెట్టడం ఎంతో పవిత్రమైన సేవ అని అన్నారు. "అన్నదానం మహాదానం.. ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు" అని పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడమే కాకుండా, మనలోని మానవత్వాన్ని చాటుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. భక్తి ఉన్న చోట సేవాభావం కూడా ఉండాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సోదరభావం, మానవతా విలువలు మరింత పెంపొందుతాయని ఎస్సై మేడా ప్రసాద్ అన్నారు. అన్నం పెట్టిన చేయి ఎప్పుడూ గొప్పదేనని, ఆకలి తీర్చే మనసు ఎప్పుడూ పవిత్రమైనదని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ అన్నదానం వంటి సేవా కార్యక్రమాలకు ముందుకు వస్తున్న జి.సి.ఏ. యూత్ సభ్యులను ఆయన అభినందించారు. గణేష్ మండపం వద్ద ఉదయం ప్రత్యేక కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులు, గ్రామస్తులకు నిర్వాహకులు సాదరంగా అన్నప్రసాదాన్ని అందించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఊరు పేరు కోసం ఉద్యమిస్తాం

## సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ



గజ్వేల్,అరుణ ప్రభ : మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం తమ సొంత ఇళ్లు, సాగుభూములను త్యాగం చేసిన నిర్వాసిత గ్రామాల ప్రజల ఉనికి, గ్రామాల గుర్తింపుకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తరతరాలుగా కొనసాగుతున్న తమ గ్రామాల పేర్లను రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించి ముట్రాజ్‌పల్లి పేరును నమోదు చేయడం వల్ల గ్రామాల ఉనికి, సంస్కృతి, చారిత్రక గుర్తింపు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. గ్రామాల పేర్ల మార్పు కారణంగా ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, నష్టపరిహారాలు, ఇతర దరఖాస్తుల విషయంలోనూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. "మేము ప్రాజెక్టు కోసం మా ఊళ్లను త్యాగం చేశామే తప్ప.. మా గ్రామాల గుర్తింపును కాదు" అని శివలింగ కృష్ణ స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రెవెన్యూ రికార్డుల్లో, ప్రజల అన్ని రకాల గుర్తింపు కార్డుల్లో తమ పాత గ్రామాల పేర్లను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం అవసరమైతే ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కొండకింది పోచయ్య, పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, సీపీఐ నాయకులు వెంకటచారి, వెంకటేశం, పోతుల శంకర్, గూడూరి బాలనర్సు, మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సన్నాహక సమావేశం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 21: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో సీఎం సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 22న ఉదయం 11 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల కె-కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. సీఎం పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమీకరణ, సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నాహక సమావేశానికి హాజరుకావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సమావేశానికి తప్పక హాజరై సీఎం పర్యటన విజయవంతానికి తమ సహకారం అందించాలని ఆది శ్రీనివాస్ కోరారు.



# కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: మానూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి--షాదీముబారక్ పథకం కింద 11 చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి కింద 15 చెక్కులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాలు, వైద్య చికిత్స వంటి అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులకు రేషన్ సరుకులు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల కోసం దళారులను ఆశ్రయించకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# మత్స్యకారులకు హెచ్‌ఎస్‌డీ కార్డుల పంపిణీ

## 546 మందికి కార్డులు అందజేత

విశాఖపట్నం, సెప్టెంబర్ 21: శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మత్స్యకారులకు హెచ్‌ఎస్‌డీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. మొత్తం 546 కార్డుల్లో వీఎస్-ఎంఎం కేటగిరీలో 268, వీఎస్-ఎంఓ కేటగిరీలో 73, వీఎన్-ఎంఓ కేటగిరీలో 205 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు డీజిల్ ఖర్చు భారంగా మారుతోందని, ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ సబ్సిడీ ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెచ్‌ఎస్‌డీ కార్డుల ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు సులభంగా అందేలా అధికారులతో సమన్వయం చేస్తామన్నారు. బోటుకు మూడు లీటర్ల చొప్పున డీజిల్ అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మురళి, రవి, మత్స్యకారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు పద్మశాలీలకు ఆదర్శం

## ::: పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లి బత్తిని దేవదాస్



గజ్వేల్,అరుణ ప్రభ : తెలంగాణ కోసం నిరంతరం శ్రమించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ప్రతి పద్మశాలీకి ఆదర్శమని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లి బత్తిని దేవదాస్ అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవదాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పద్మశాలీల అభ్యున్నతికి ఆయన అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కాముని మురళి, న్యాయవాది కాళీ ప్రసాద్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు గాడిపల్లి శ్రీనివాస్, దేవులపల్లి రాజారాం, తలకొక్కుల దుర్గాప్రసాద్, గాడిపల్లి విజయ్, రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూల సత్యం, ప్రధాన కార్యదర్శి ఏ. రామచంద్రం, ఏడెల్లి రామచంద్రం, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, దేవసాని పోశెట్టి, నల్ల శివకుమార్, భాస్కర్‌తో పాటు పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, సెప్టెంబరు 22, 2026

# వినాయక మండపాల్లో ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక పూజలు

దేవరకొండ: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా దేవరకొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని 5వ వార్డు, 18వ వార్డులతో పాటు 20వ వార్డులో కొలువుదీరిన శ్రీ వినాయకుడిని దర్శించుకుని భక్తులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వహించిన ఉత్సవ కార్యక్రమాల్లో భక్తులతో కలిసి పాల్గొన్నారు. చివరగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేశ్వర్లు గారి 20వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపం ఎదుట నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే శ్రీ గణేశుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# మన ఉత్తమ జీవనశైలి, మంచి అలవాట్లే మన ఎదుగుదలకు నిచ్చెనగా నిలుస్తాయి

### లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు



మన ఎదుగుదలను నిర్ణయించే ప్రధాన అంశాల్లో క్రమశిక్షణ కలిగిన దినచర్య, మనం ప్రదర్శించే మంచి అలవాట్లు మాత్రమే ఉంటాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, కవి, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ అన్నారు అన్నారు.

ఈ రోజు శాతవాహన లయన్స్ క్లబ్ నేతృత్వంలో జూబ్లీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉంటున్నదని అన్నారు. మన జీవనశైలిలో రోజుకు 3 - 4 ఇంట్లో చదువుకోవడానికి కేటాయించడం, పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను మనసు పెట్టి విని ఆకలింపు చేసుకోవడం, ప్రతి రోజు ఒక గంట మైదాన క్రీడలకు కేటాయించడం జరగాలని సూచించారు. పేదరికాన్ని నిర్మూలించే ఏకైక ఉత్తమ సాధనం విద్య మాత్రమే అని చెప్పారు. లయన్ మర్రిపల్లి మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ దాసరి తిరుపతి రెడ్డిలు మాట్లాడి కౌమార దశలో ఉన్న విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. సీనియర్ లయన్ కోమల్ల రాజేందర్ రెడ్డి, లయన్ నార్ల వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు పదవి విరమణ పొందుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జలజా రాణిని సన్మానించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ముఖ్య అతిథి లయన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని సముచితంగా సత్కరించారు.

# పద్యాల తోరణం-2026లో జడ్పీ హెచ్ ఎస్ తొర్రూరు విద్యార్థుల సత్తా

### జిల్లా స్థాయి పోటీల్లో 6 బహుమతులు కైవసంబి

### విద్యార్థుల ప్రతిభకు తెలుగు ఉపాధ్యాయుల శిక్షణే బలం



ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ సెప్టెంబర్ 21: తెలుగు భాషా సాహిత్యం విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న “పద్యాల తోరణం--2026” జిల్లా స్థాయి పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్రూరు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఏకంగా 6 బహుమతులను సాధించారు. సెప్టెంబర్ 21న సాధన కుటీర్, ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతల వివరాలు10వ తరగతి ప్రథమ బహుమతి ఐదు వేల రూపాయలు శివనందిని, తృతీయ బహుమతి రెండు రూపాయలు  నాగాంబిక 8వ తరగతి ప్రథమ బహుమతి ఐదు వేల రూపాయలు బి. పావని తృతీయ బహుమతి రెండు వేల రూపాయలు షణ్ముఖ ప్రియ 7వ తరగతి ద్వితీయ బహుమతి మూడు వేల రూపాయలు పి. పూజ 6వ తరగతి ద్వితీయ బహుమతి మూడు వేల రూపాయలు వి. శ్రుతి విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన వేదిక కల్పించడం పాఠశాల బాధ్యత. జిల్లా స్థాయి పోటీలలో మన విద్యార్థులు ఆరు బహుమతులు సాధించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులతో పాటు వారికి నిరంతరం శిక్షణ, మార్గదర్శకత్వం అందించిన తెలుగు ఉపాధ్యాయులు కందాడే రంగరాజు, బా గ్యమ్మ ను ప్రత్యేకంగా అభినందించారు విద్యార్థులను పద్య పఠనంలో తీర్చిదిద్ది, పోటీలకు సిద్ధం చేయడంలో తెలుగు ఉపాధ్యాయులు  కందాడే రంగరాజు, భాగ్యమ్మ విశేష కృషి చేశారు. వారి మార్గదర్శకత్వంలో విద్యార్థులు జిల్లా స్థాయిలో తమ ప్రతిభను చాటుకుని పాఠశాలకు కీర్తి తీసుకువచ్చారు. విజేత విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు హృదయపూర్వకంగా అభినందించారు. తెలుగు భాషా సాహిత్యంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తూ, పద్య సాహిత్య పరిరక్షణకు నా పరిస్థితి ఉన్నత పాఠశాల తొర్రూరు  చేస్తున్న కృషికి ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

### పత్రికల్లో ప్రచురితమయ్యే సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, ప్రజావాణి ద్వారా అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని సమస్యలకు సంబంధించి వార్తాపత్రికలు, ఇతర మాధ్యమాల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికల్లో ప్రచురితమైన సమస్యలను కేవలం వార్తలుగా కాకుండా ప్రజల సమస్యలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలుగా పరిగణించి, వాటి వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో విద్య, వైద్య, గృహ నిర్మాణ తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలు ప్రజల దృష్టికి వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని, మందులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. గృహ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, గృహ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి, దాని పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని, బాధ్యతను నిర్ణయించుకుని, నిర్ణీత గడువులో పరిష్కరించే విధంగా వ్యవస్థీకృతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఒకే సమస్య పదేపదే ప్రజావాణిలో రావడం లేదా పత్రికల్లో ప్రతికూల వార్తగా ప్రచురితం కావడం జరగకుండా అధికారులు ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



# జాతీయ వినియోగదారుల సదస్సులో ధర్మవరం ప్రతినిధులు

ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : విజయవాడలో నిర్వహించిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సులో ధర్మవరం మండల వినియోగదారుల సేవా కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నట్లు అధ్యక్షుడు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. సదస్సులో వినియోగదారుల హక్కులు, ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలపై చర్చించారు. ఏపీ సివిల్ సప్లైస్, వినియోగదారుల వ్యవహారాల కమిషనర్ కన్నబాబు, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి పళ్లెం జనార్దన్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్యపై స్పందించిన మంత్రి సత్యకుమార్ ::: అనంతపురం కిమ్స్ సవేరాలో చికిత్స



ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : రెండు కిడ్నీలకు ఇన్ఫెక్షన్ రావడంతో చికిత్స అవసరమైన రాయదుర్గానికి చెందిన మంజుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రిలో వైద్యం అందించారు. చికిత్స అనంతరం మంజు డిశ్చార్జ్ అయ్యారు. మంజు సమస్యను ధర్మవరం బీజేపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ నాయకులు మల్లికార్జున, హరీష్, జింక చంద్రశేఖర్, బండ్లపల్లి రాజు, ఉట్టి ప్రసాద్, మురళికి మంజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## హైకోర్టు తీర్పుతో కేడీసీసీబీ చైర్మన్‌గా కొండూరు రవీందర్‌రావు పునఃబాధ్యతలు



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ ప్రతినిధి, సెప్టెంబర్ 21:లిలి తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా కొండూరు రవీందర్‌రావు సోమవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర సహకార బ్యాంకులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 598ను రద్దు చేస్తూ, గతంలో అమల్లో ఉన్న జీవో నంబర్ 386ను కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పు నేపథ్యంలో కొండూరు రవీందర్‌రావు కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పునఃబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, సిబ్బంది, సహకార రంగానికి చెందిన పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం బ్యాంకు కార్యకలాపాలు, సహకార రంగ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



## కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ సభ్యుల శుభాకాంక్షలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి, సెప్టెంబర్ 21: కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీ) చైర్మన్‌గా కొండూరు రవీందర్ రావు సోమవారం పునఃబాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ సభ్యులు కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో కొండూరు రవీందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా పునఃబాధ్యతలు స్వీకరించిన ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సహకార రంగంలో కేడీసీసీ బ్యాంక్ మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## కృష్ణనగర్‌లో చెత్త ప్రాంతం 'గ్రీన్‌స్పాట్'గా మార్పు ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతకు పెద్దపీట

విశాఖపట్నం, అరుణప్రభ:లిలి గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ దక్షిణ మండలం పరిధిలోని 29వ వార్డు కృష్ణనగర్‌లో చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రాంతాన్ని 'గ్రీన్‌స్పాట్'గా తీర్చిదిద్దారు. స్థానికుల భాగస్వామ్యంతో చెత్తను తొలగించి మొక్కలు, పూల మొక్కలు నాటడంతో పాటు రంగవల్లులతో ప్రాంతాన్ని సుందరీకరించారు. దీంతో గతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశం ఆహ్లాదకరంగా మారింది. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ప్రజల సహకారంతో విశాఖను మరింత పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.



## అన్నసమారాధనలో పాల్గొన్న జనసేన నాయకులు

ఈ రోజు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్‌లో జనసేన నాయకుడు బోగాది వెంకటేశ్వర్ రావు ఆహ్వానం మేరకు వినాయక నవరాత్రుల వేడుకల సందర్భంగా నిర్వహించిన, ప్రత్యేక పూజలకు మరియు అన్నసమారాధన కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర  జనసేన ఇంచార్జ్ శ్రీ నేమూరి శంకర్ గౌడ్ ,కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని భక్తులతో కలిసి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, భరత్ గౌడ్, స్వాతి గౌడ్ మరియు బస్తీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## 22 సెప్టెంబర్ రోజు సుద్దాల అశోక్ తేజకు “తెలంగాణ తెలుగు తేజం” రాష్ట్రస్థాయి పురస్కార ప్రదానోత్సవం



ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు ప్రతిష్ఠాత్మక 'బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక' పురస్కార ప్రదానోత్సవం 22 సెప్టెంబర్ 2026 సాయంత్రం 5:00 గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుందని పురస్కార కమిటీ చైర్మన్ తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి, తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి వి శ్యాంప్రసాద్ లాల్, ఐఏఎస్ , డైరెక్టర్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, సభా ప్రారంభకులు శ్రీమతి జానకి రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పురస్కారంలో భాగంగా ఒక సైటేషన్, సముచిత సన్మానం, నగదు బహుమతి ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సాహితీ కార్యక్రమానికి సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు.

# ఆటో చార్జీ పెంపుపై యూనియన్ నాయకుల ధర్నా

### 5.30 కిలోమీటర్లకు రూ.20 మాత్రమే - యూనియన్ నేతలు




ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : ఆటో చార్జీలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేతిరెడ్డి కాలనీ వద్ద సోమవారం ఐక్య ఆటో యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీంతో సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. యూనియన్ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ పై కాలనీ నుంచి దుర్గమ్మ గుడి వరకు 5.30 కిలోమీటర్లకు మాత్రమే రూ.20 చార్జీ తీసుకుంటున్నామని తెలిపారు. మిగిలిన మార్గాల్లో పాత చార్జీలే కొనసాగుతున్నాయని చెప్పారు. ఎర్రగుంట వరకు రూ.10, అక్కడి నుంచి దుర్గమ్మ గుడి వరకు మరో రూ.10 తీసుకుంటున్నట్లు వివరించారు. సుమారు 15 ఏళ్లుగా రూ.10 చార్జీతోనే ప్రయాణికులకు సేవలందిస్తున్నామని, పెరిగిన ఇంధనం, విడిభాగాలు, ఇతర ఖర్చులతో ఆటో కార్మికులపై భారం పెరిగిందన్నారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు సహకరించాలని కోరారు.

## పీజీఆర్ఎస్‌లో 12 అర్జీల స్వీకరణ

### ::: ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డి



ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో 12 అర్జీలు స్వీకరించినట్లు ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ శాఖకు 6, సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖకు 4, ఇతర శాఖలకు 2 అర్జీలు అందినట్లు చెప్పారు. భూ రికార్డులు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు, దారుల వివాదాలు, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, పెన్షన్, విద్య తదితర అంశాలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ధర్మవరం నుంచి 5, కనగానపల్లి నుంచి 2, రామగిరి నుంచి 2, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి, తాడిమర్రి నుంచి ఒక్కొక్క అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలు నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### కళాజ్యోతి శతవార్షికోత్సవాలకు ఏర్పాట్లు
### 26 నుంచి మూడు రోజుల వేడుకలు



ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం బ్రాహ్మణ వీధిలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఈ నెల 26 నుంచి 28 వరకు శతవార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కళాజ్యోతి కమిటీ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలగొండ రామకృష్ణ తెలిపారు. మూడు రోజులూ సాయంత్రం 5 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 26న పూర్వ కార్యవర్గ సభ్యులు, కళాకారులకు సన్మానం, నృత్య ప్రదర్శన, 27న నృత్య ప్రదర్శనతో పాటు గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ గాన కచేరి, 28న సన్మాన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటాయని తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ పార్థసారథి, పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డి, డీఎస్పీ జగన్నాథరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

### సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు



ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్): శ్రీ సత్యసాయి జిల్లాలోని 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని ముసుగు మధు తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని, సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఎర్రంశెట్టి రమణ, బుడగ వెంకటనారాయణ, గుర్రం వెంకటస్వామి, సకల రాజా, ఆదినారాయణ, శ్రీనివాసులు, లలితమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో 5వ రోజుకు చేరుకున్న దీక్షలు



అల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఐదో రోజు దీక్షల్లో భాగంగా శేరుపల్లి మల్లేష్, రషీద్, సత్తయ్య లు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, హామీల అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీక్షలకు పటోళ్ల సురేందర్ రెడ్డి, నగేష్, రాము సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




### క్రమబద్ధీకరణ కోసం కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగులు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు 100 శాతం స్థూల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జేఏసీ ప్రతినిధులు వెంకట రామాంజనేయులు, పద్మ, మహబూబ్‌జాన్ కోరారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరుణ, కమలమ్మ, లుథియా, మాధవిలత, లక్ష్మీనరసమ్మ, సంధ్య, జయమ్మ, అమిద, అశ్వని, లలిత, నాగేంద్ర, అనిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# రామ మందిరంలో భారీ కుంభకోణం: 105 సార్లు విరాళాల చోరీ

**సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం**

**ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్**

**సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు**

**ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు**



అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు

### ::: ఈ నెల 26న పుట్టపర్తిలో ప్రత్యేక వైద్య శిబిరం

పుట్టపర్తి, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తోంది. ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల అభ్యర్థన మేరకు ఈ నెల 26న పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జర్నలిస్టులకు అందించనున్న వైద్య సేవలపై చర్చించారు. శిబిరంలో హెచ్‌బీ, సీబీసీ, బీపీ, ఎఫ్‌బీఎస్, పీపీఎస్, ఈసీజీ, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, మూత్ర పరీక్షలు, రక్త సంబంధిత, జీవరసాయన, కొవ్వు పదార్థాల పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళలకు పింక్ బస్ సేవల ద్వారా నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ కోరారు. వైద్య పరీక్షలకు హాజరయ్యేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పనిచేస్తున్న సంస్థ గుర్తింపు కార్డు లేదా అక్రిడిటేషన్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు పొరకలవన్నప్ప, ఏపీబీజేఏ అధ్యక్షుడు చలపతి, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ జిల్లా కమిటీలు ఏకగ్రీవం

### జిల్లా కమిటీల్లో ధర్మవరం పాత్రికేయులకు పదవులు



పుట్టపర్తి, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ శ్రీ సత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాలు పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. రాష్ట్ర నాయకుల సమక్షంలో జరిగిన ఎన్నికల ప్రక్రియకు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాయలసీమ ఇన్‌చార్జి జయరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేపటి రామాంజనేయులు తదితరులు నేతృత్వం వహించారు. ఏపీబీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన మురళిగౌడ్ (ఐ న్యూస్), ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బాబయ్య, ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నికైన వారికి ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి, ప్రధాన కార్యదర్శి గంటపల్లి నాగరాజు, ఉపాధ్యక్షులు నాగార్జున, ఆంజనేయులు, మంజునాథ్, ప్రచార కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

### ఏపీఆర్ గోల్డెన్ లీఫ్ కమ్యూనిటీ లో గణేష్ లడ్డు వేలం

### 10 లక్షలకు ఎగినేని వేణుగోపాల్ చౌదరి,మౌనిక రెడ్డి కైవసం



తుర్కయంజాల్,అరుణ ప్రభ: వినాయక చవితి గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా ఏపీఆర్ గోల్డెన్ లీఫ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆది వారం వినాయకుడికి ప్రత్యేక పూజా కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గణనాథుని లడ్డు వేలం పాట కార్యక్రమం నిర్వహించారు వేలంపాటలో పది లక్షలకు గణనాథుని లడ్డును ఎగినేని వేణుగోపాల్ చౌదరి మౌనిక రెడ్డి దంపతులు కైవసం చేసుకున్నారు.వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలుగా నిలుస్తున్నాయని అన్నారు.వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమంలో ఏపీఆర్ గోల్డెన్ లీఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



### గురజాడ సేవలు చిరస్మరణీయం: ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డి

ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : తెలుగు సాహిత్యానికి, సామాజిక చైతన్యానికి గురజాడ వెంకట అప్పారావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్డీఓ ఓ. రామభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురజాడ జయంతి సందర్భంగా సోమవారం ఆయన సేవలను స్మరించుకున్నారు. 'కన్యాశుల్కం' ద్వారా సామాజిక సమస్యలను ఎత్తిచూపిన గురజాడ.. వాడుక భాషకు ప్రాధాన్యతనిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు చేరువ చేశారని తెలిపారు. 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అనే భావన ఆయన మానవతా దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.




### కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో 31 మంది ఉత్తీర్ణత

ధర్మవరం, సెప్టెంబరు 21; (అరుణ ప్రభ న్యూస్) : స్థానిక సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. తమిళనాడుకు చెందిన కరాటే గురువులు మాస్టర్ చిన్నస్వామి, కుమార్, రంజిత్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆత్మరక్షణ, పంచ్, కిక్ తదితర అంశాల్లో మెళకువలు నేర్పారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నూతన బెల్టులు అందించారు. కరాటే ద్వారా శారీరక దృఢత్వం, ఏకాగ్రత, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని మాస్టర్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, సెప్టెంబరు 22, 2026

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

### ప్రజలకు తక్షణ సేవలు అందించడం కోసమే డివిజన్, మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



అరుణప్రభ 21 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధి అడ్వకేట్ ఆనంద్ కుమార్, ల కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు, స్నేహ శబరిష్ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత అనేకంగా సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో డివిజనల్, మండల స్థాయిలలో పాటు జిల్లా కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలలో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు మహబూబాబాద్ మండలం జామాండ్లపల్లి గ్రామానికి చెందిన కొణతం లలిత తనకు చెందిన రిజిస్ట్రేషన్ గల భూమి 22 ఎ నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్నదని తన యాజమాన్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు తన వద్ద ఉన్నాయని అధికారులు రికార్డులను పరిశీలించి 22 ఎ జాబితా నుండి తన భూమిని తొలగించాలని కోరారు గార్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ దేవ్లా సీతారామ ప్రాజెక్ట్ క్రింద తన భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నారని అట్టి పరిహారం తన బ్యాంకు ఖాతాలో కాకుండా వేరొకరి బ్యాంకు ఖాతాలో జమచేయడం జరిగిందని అట్టి పరిహారాన్ని తనకు ఇప్పించగలరని కోరారు బయ్యారం మండలం జగత్రావు పేట కు చెందిన పాయం వాలమ్మ తనకున్న వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ తొ చదును చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు అట్టి భూమి ఫారెస్ట్ భూమని సాగుచేసుకునేందుకు వీలు లేదని అడ్డు కుంటున్నారని తనకు తగిన న్యాయం చేసి తన భూమిని సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన ( 120 ) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ముఖ్యమంత్రి గారు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి చేయాలన్నారు, జిల్లాలోని జిల్లా, డివిజనల్ , మండల కేంద్రాల్లో నీ, ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ విధానం ద్వారా తమ ముఖచిత్రాలతో కూడిన హాజరు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్ని విభాగాల ప్రధాన అధికారులను ఆదేశించారు, ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల సౌకర్యం నిర్వహించే ఇంటర్నెట్ సౌకర్యాలను తెలంగాణ టి ఫైబర్ ఇంటర్నెట్ సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినందున తమ కార్యాలయాలలో వర్క్ ఆర్డర్ వెంటనే ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తొమ్మిదవ జాతీయ పోషణ మాసం మా అంగన్వాడి, మా బాధ్యత. సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 9 వరకు జరిగే కార్యక్రమాల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ ప్రజావాణిలో డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, సిపిఓ,వి. శ్రీనివాసరావు, ఉద్యానవల్ల అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ట్రైబల్, ఎస్సీ, బిసి సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాసరావు, శ్రీజ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, జిఎం ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ రెడ్డి, డిపిఓ రేవంత్, డిసిఓ, సర్దార్ సింగ్, ఎల్డీఎం యాదగిరి, ఇన్చార్జి వెల్ఫేర్ అధికారిని కె.శిరీష, డిఎస్ఓ రమేష్, డి ఎం సివిల్ సప్లై నరసింహారావు, ఎడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ శ్రీనివాసులు, క్రీడల అధికారి జ్యోతి, ఎడి మైనింగ్ వెంకట రమణ, ఉపాధి కల్పనా అధికారి రజిత, మెప్మా డీఎంసి విజయ, ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర, అడిషనల్ డిఆర్డిఓ మల్లీశ్వరి, జిల్లా ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, ఇన్చార్జి డిఈఓ శ్రీరాములు, టిపిఓ సాయిరాం, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరింటెంట్లు మదన్ గోపాల్, రాజేష్, దామోదర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు



## బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన ఈవోగా ఎం. విఠలయ్య బాధ్యతల స్వీకరణ

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా ఈవో ఎం. విఠలయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. గతంలో ఇదే ఆలయంలో ఈవోగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఆలయ నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై తనకు పూర్తి అవగాహన ఉందని ఎం. విఠలయ్య తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, భక్తులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్‌తో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ నందన దంపతులపై ప్రజావాణిలో ఫిర్యాదు

యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసి మోసగించినట్లు యూట్యూబర్ నందన, ఆమె భర్త మధుకర్‌లపై ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ మేరకు బాధితులు సోమవారం ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. యూకే ప్రభుత్వం తమ కన్సల్టెన్సీకి ఉద్యోగులు నియామక ప్రక్రియ కోసం అనుమతులు మంజూరు చేసిందని నందన, మధుకర్ దంపతులు నమ్మబలికారు. ప్రధానంగా స్టూడెంట్, విజిటర్ వీసాలపై యూకేకు వెళ్లి, వీసా గడువు ముగియనున్న వారిని లక్ష్యంగా చేసుకుని వర్క్ వీసాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ. 25 లక్షల నుంచి రూ. 95 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అయితే, సదరు కన్సల్టెన్సీ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలడంతో యూకే ప్రభుత్వం తమపై కఠిన చర్యలు తీసుకుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో తెలంగాణలోని వికారాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారని వారు వివరించారు. సోమవారం బేగంపేటలోని జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో బాధితులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్‌పర్సన్, ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎన్నారై సలహా కమిటీ ఛైర్మన్ డాక్టర్ వినోద్ కుమార్‌లను కలిసి తమ సమస్యను విన్నవించారు. వారి నుంచి ఫిర్యాదును స్వీకరించిన అధికారులు, ఈ ఉదంతాన్ని రాష్ట్ర డీజీపీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టికి తీసుకెళ్లి, పూర్తిస్థాయి దర్యాప్తునకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.



# వెంకటాపురంలో వినాయక మండపాల సందర్శన




వెంకటాపురం: వెంకటాపురం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సూర్యకిరణ్, దేవేందర్, లక్ష్మణ్ ముదిరాజ్, శివతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వెస్ట్ వెంకటాపురంలోని వినాయక మండపాన్ని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి సందర్శించారు. కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యకిరణ్, దేవేందర్, లక్ష్మణ్, నిమ్మ అశోక్ రెడ్డి, తోట వరుణ్, శివయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జన కార్యక్రమంలో అధికారులు**

వెంకటాపురం పరిధిలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డీసీ బోగేశ్వర్లు పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అధికారులు పర్యవేక్షించారు.




CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY, # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printed at: GARUDA PRINT-ERS, # H.No.2-86/1, Plot No.23-SP, SyNo.417, Sagar Highway, Ranganaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510. Telangana. Published at: # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District. 501511. Telangana....www.arunaprabha.com.email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889.